


Truth of News

# సూర్య వాస్తవం

RNI NO : APTEL/25/A0239

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 210 | గురువారం 22 జనవరి 2026 | పేజీలు : 9 | వెల రూ.6.50

irculated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## రాహుల్ గాంధీకి అరుదైన కానుక..

### - మనవడి చెంతకు చేరిన తాత పర్సు

రాయ్ బరేలి – సూర్య వాస్తవం

కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఓ అరుదైన కానుక లభించింది. ఎప్పుడో తన తాత ఫిరోజ్‌గాంధీ చేజార్చుకున్న పర్సు.. మళ్లీ ఇన్నేళ్లకు తన చెంతకు చేరింది. ఓ అభిమాని తన తాత పర్సును రాయ్ బరేలీ పర్యటనలో ఉన్న రాహుల్‌గాంధీకి అందించారు. ఆ పర్సును చూడగానే రాహుల్

- మిగతా 2లో..




## ఏపీ మద్యం కేసులో ముగ్గురు నిందితులకు నిరాశ

- రెగ్యులర్ బెయిల్ కోసం సుప్రీంను ఆశ్రయించిన కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయ్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప
- రెగ్యులర్ బెయిల్ ఇవ్వడానికి నిరాకరించిన సుప్రీంకోర్టు
- ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని సూచన

2లో



## దుబాయ్ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు ఏపీ సిద్ధం...

- యూఏఈకి సీఎం చంద్రబాబు ప్రతిపాదన
- ప్రపంచ ఆర్థిక సదస్సులో యూఏఈ మంత్రితో సీఎం చంద్రబాబు భేటీ
- ఏపీలో దుబాయ్ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుపై కీలక చర్చలు
- పారిశ్రామిక పార్కులు, ఇంధన రంగంలో పెట్టుబడులకు ఆహ్వానం
- సీఎం చంద్రబాబు ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన యూఏఈ మంత్రి
- ఏపీలో ఉన్న మౌలిక సదుపాయాలను వివరించిన ముఖ్యమంత్రి

అమరావతి– సూర్య వాస్తవం




స్విట్జర్లాండ్ లోని దావోస్ లో ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా ఆంధ్రప్రదేశ్?కు భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) విదేశీ వాణిజ్య శాఖ మంత్రి డాక్టర్ థాని బిన్ అహ్మద్ అల్ జయేదీతో బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను వివరిస్తూ, పలు కీలక రంగాల్లో భాగస్వామ్యం కావాలని యూఏఈని ఆహ్వానించారు. ఈ భేటీలో ప్రధానంగా ఏపీలో 'దుబాయ్ ఫుడ్ క్లస్టర్' ఏర్పాటు ప్రతిపాదనపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో అగ్రిటెక్, ఫుడ్ టెక్, ఆక్వా టెక్నాలజీలతో పాటు ఫుడ్ పార్కుల అభివృద్ధి, ఆహార భద్రత వంటి కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ, ఆక్వా, ఉద్యాన ఉత్పత్తులు అధికంగా ఉన్నాయని, వాటిని ప్రాసెస్ చేసి అంతర్జాతీయ మార్కెట్లకు తరలించేందుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ఆహార ఉత్పత్తులను వేగంగా, సులభంగా రవాణా చేయడానికి అవసరమైన పోర్టులు, విమానాశ్రయాలు, రోడ్డు, రైలు మార్గాలతో కూడిన పటిష్టమైన

- మిగతా 2లో..

## ఫాలోఅప్ చేస్తాం

- హైదరాబాద్‌లో డబ్ల్యూఈఎఫ్ పెట్టుబడుల కొనసాగింపు సదస్సు
- ఏటా జులైలో నిర్వహణ : దావోస్ 'జాయిన్ ది రైజ్' కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదన
- ఏకగ్రీవంగా మద్దతు తెలిపిన బిజినెస్ లీడర్స్
- అదే వేదికపై తెలంగాణ లైఫ్ సైన్సెస్ పాలసీ ఆవిష్కరణ
- వాణిజ్య సదస్సులో సీఎంతో సినీ నటుడు చిరంజీవి భేటీ

హైదరాబాద్ – సూర్య వాస్తవం



దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్)లో జరిగే ఒప్పందాల అమలు కోసం ఇకపై ఏటా హైదరాబాద్‌లో ఫాలో–అప్ సదస్సులు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఏటా జులై మాసంలో ఈ కార్యక్రమాన్ని నిర్వ హిస్తామని దావోస్ వేదికగా బుధవారం జరిగిన 'జాయిన్ ది రైజ్' కార్యక్రమంలో ప్రకటించారు. ఈ ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం పెట్టుబడుల ఒప్పందాలు, వ్యాపార వాణిజ్య నిర్ణయాలకు ఒక సంవత్సరం చాలా ఎక్కువ సమయమని

- మిగతా 2లో..



## అమరావతికి చట్టబద్ధత...

- పార్లమెంట్‌లో బిల్లుకు కేంద్రం సన్నాహాలు
- పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టే అవకాశం
- హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు ముగియడంతో కీలక పరిణామం
- వివిధ మంత్రిత్వ శాఖల అభిప్రాయాలను సేకరిస్తున్న హోంశాఖ
- ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో సవరణకు సన్నాహాలు

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## మెటా గ్లోబల్ పాలసీ హెడ్‌తో మంత్రి నారా లోకేశ్ భేటీ

- దావోస్‌లో మెటా ప్రతినిధులతో మంత్రి నారా లోకేశ్ సమావేశం
- విశాఖలో డేటా సెంటర్ సామర్థ్యం పెంపుపై కీలక చర్చలు
- రియాలిటీ ల్యాబ్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ప్రతిపాదన
- వాట్సాప్ ద్వారా పౌరసేవలను విస్తరించాలని నిర్ణయం
- విశాఖ ఏఐ సామర్థ్యాన్ని వాడుకోవడమే లక్ష్యమని వెల్లడి

అమరావతి– సూర్య వాస్తవం




ఆంధ్రప్రదేశ్‌లో టెక్నాలజీ ఆధారిత అభివృద్ధి, పెట్టుబడులే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా, దావోస్‌లో పర్యటిస్తున్న ఏపీ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్, సోషల్ మీడియా దిగ్గజం 'మెటా' (ఫేస్‌బుక్ మాతృ సంస్థ) ప్రతినిధులతో సమావేశమయ్యారు. మెటా గ్లోబల్ పాలసీ విభాగాధిపతి కెవిన్ మార్టిన్‌తో ఆయన భేటీ అయి రాష్ట్రంలో పెట్టుబడులు, విస్తరణ అవకాశాలపై చర్చిం చారు. ఈ సమావేశంలో ప్రధానంగా మూడు కీలక అంశాలపై చర్చించినట్టు మంత్రి లోకేశ్ తెలిపారు. విశాఖపట్నంలో ఇప్పటికే ఉన్న మెటా డేటా సెంటర్ సామర్థ్యాన్ని సంస్థ అంతర్జాతీయ అవసరాలకు అనుగుణంగా భారీగా పెంచడంపై చర్చించారు. దీంతో పాటు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ భాగస్వామ్యంతో 'రియాలిటీ ల్యాబ్స్–ఫోకస్డ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనపైనా చర్చలు జరిగాయి. అంతేకాకుండా, రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్, పౌర సేవలను మరింత విస్తృతం చేసేందుకు వాట్సాప్ ఆధారిత సేవలను పెంచాలని నిర్ణ యించారు. ఈ చర్చలు ఫలప్రదంగా సాగాయని, మెటాతో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నామని లోకేశ్ పేర్కొన్నారు. విశాఖపట్నం ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో

- మిగతా 2లో..



## ఏడాదిన్నర తరువాత పాదయాత్ర

- కూటమి పాలనలో ఎవరికీ మేలు జరగలేదు
- వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి

అమరావతి – సూర్య వాస్తవం

కూటమి పాలనలో రాష్ట్రంలో ఎవరికీ మేలు జరగలేదని వ్యవస్థలు అన్నీ నిర్వీర్యం అయ్యాయని వైసిపి అధినేత జగన్?మోహన్?రెడ్డి అన్నారు. ప్రభుత్వానికి ఇంకా మూడేళ్లు ఉందని, ఏడాదిన్నర తరువాత తాను పాదయాత్ర మొదలుపెట్టి ఏడాదిన్నరపాటు జనంలోనే ఉంటానని అన్నారు. బుధవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. అలాగే పల్నాడు జిల్లా పిన్నెల్లిలో ఇటీవల హత్యకు గురైన సాల్మన్ కుటుంబ సభ్యులతోనూ మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలూ నిర్వీర్యం

- మిగతా 7లో..

# రాహుల్ గాంధీకి అరుదైన కానుక..

(మొదటిపేజీ తరువాయి)

భావోద్వేగానికి గురయ్యారు. వెంటనే వేదికపైన ఉన్న తాను ఆ పర్సును పరిశీలించి దాన్ని ఫొటో తీసుకుని తన తల్లి సోనియాగాంధీకి వాట్సాప్‌లో షేర్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి అంకిత్ మయాంక్ షేర్ చేసిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. రాహుల్ గాంధీ తాత ఫిరోజ్ గాంధీ దశాబ్దాల క్రితం రాయ్ బరేలీ పర్యటనలో పర్సును పోగొట్టుకున్నారు. దాన్ని ఓ కుటుంబం ఇన్నాళ్లూ ఆయన జ్ఞాపకార్థం భద్రంగా దాచింది. తాజాగా రారుబరేలీ పర్యటనలో ఉన్న ఆయన మనవడు, ఎంపీ రాహుల్ గాంధీని కలిసి ఆ పర్సును అందజేయడం విశేషంగా నిలిచింది. స్థానిక కుటుంబం దశాబ్దాలుగా భద్రపరిచిన ఈ పర్సును రారు బరేలి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహక కమిటీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు వికాస్ సింగ్ తన నియోజకవర్గంలో పర్యటన రెండో రోజున గాంధీకి అందజేశారు. ఈ సందర్భంగా వికాస్ సింగ్ రాహుల్‌తో ఏమన్నారంటే.. ”చాలా ఏళ్ల క్రితం, రారుబరేలిలో జరిగిన ఒక కార్యక్రమంలో, నా మామకి ఈ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ఈ పర్సు దొరికింది. అప్పటినుంచీ ఆయన దానిని భద్రంగా దాచారు. ఆయన మరణించిన తర్వాత దాన్ని మా అత్త దానిని భద్రపరిచారు. మీరు (రాహుల్) రారుబరేలిని సందర్శిస్తున్నారని తెలిసి దానిని మీకు అందజేయడం మా బాధ్యతగా భావించాము. ఇప్పటివరకు దీన్ని మా కుటుంబం ఒక 'అమానత్' (విలువైన ట్రస్ట్) భావించాము. దీన్ని తిరిగి ఇవ్వాలని మేము భావించాము' అని వికాస్ సింగ్ అన్నారు. కాగా భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ, ఫిరోజ్ గాంధీ 1942 మార్చి 26న ప్రేమ వివాహం చేసుకున్నారు. ఫిరోజ్ గాంధీ 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో రారు బరేలి సీటును గెలుచుకున్నారు.

# ఏపీ మద్యం కేసులో ముగ్గురు నిందితులకు నిరాశ

అమరావతి- సూర్య వాస్తవం

ఏపీ మద్యం కేసులో ముగ్గురు నిందితులకు సుప్రీంకోర్టులో తీవ్ర నిరాశ ఎదురైంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయ్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప తమ డిఫాల్ట్ బెయిల్ ను రెగ్యులర్ బెయిల్ గా మార్చాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు, నిందితులకు రెగ్యులర్ బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. ఈ అంశంపై నిర్ణయం తీసుకోవాల్సింది ట్రయల్ కోర్టేనని స్పష్టం చేసిన ధర్మాసనం, నాలుగు వారాల గడువు ఇస్తూ ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని సూచించింది. డిఫాల్ట్ బెయిల్ ఇచ్చిన సందర్భంగా విధించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశాలు జారీ చేసింది.

**మద్యం కేసు నేపథ్యం**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా జరిగాయని కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా 'జే బ్రాండ్' పేరుతో ప్రజలను నిలువుదోపిడి చేశారని తీవ్ర విమర్శలు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారంపై లోతైన విచారణకు ఆదేశించింది. దీంతో అప్పటి మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులపై కేసులు నమోదు కాగా, పలువురిని అరెస్టు చేసి జైలుకు పంపించారు. ఇప్పటికే కొందరు నిందితులకు బెయిల్ లభించగా, మరికొందరు ఇంకా జైలులోనే ఉన్నారు. ఇంకొందరు నిందితులుగా కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.

# మెటా గ్లోబల్ పాలసీ హెడ్‌తో మంత్రి నారా లోకేశ్ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

వినియోగించుకోవడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

**ఏపీలో తయారీ యూనిట్లు..**

**పవన విద్యుత్ దిగ్గజం వెస్టాస్‌కు మంత్రి లోకేశ్ ఆహ్వానం**

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలంటూ ప్రపంచంలోనే అతిపెద్ద విండ్-టర్బైన్ల తయారీ సంస్థ అయిన వెస్టాస్‌ను కూడా మంత్రి లోకేశ్ ఆహ్వానించారు. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో భాగంగా ఆయన వెస్టాస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మోర్టెన్ హోయ్ డిహోల్మ్?తో బుధవారం సమావేశమయ్యారు. ఈ భేటీ ఫలప్రదంగా జరిగిందని లోకేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను లోకేశ్ వివరించారు. రాష్ట్రంలోని పోర్టుల సమీపంలో భారీ స్థాయిలో విండ్ టర్బైన్ బ్లేడ్లు, నెసెల్ తయారీ యూనిట్లను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని వెస్టాస్‌ను కోరారు. ఏపీలో బలమైన పోర్టుల ఆధారిత లాజిస్టిక్స్ వ్యవస్థ, పవన విద్యుత్ తయారీకి అనుకూలమైన వాతావరణం ఉన్నాయని తెలిపారు. నైపుణ్యాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రముఖ సంస్థలతో కలిసి 'సెంటర్ ఫర్ విండ్ ఎనర్జీ' ఏర్పాటు చేసే ఆలోచన కూడా ఉందని వివరించారు. వెస్టాస్ సంస్థ 17.3 బిలియన్ యూరోల వార్షిక ఆదాయంతో, 68.4 బిలియన్ యూరోల ఆర్డర్ బుక్‌తో ప్రపంచంలోనే అగ్రగామిగా ఉందని లోకేశ్ పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి వృద్ధి కోసం వెస్టాస్‌తో భాగస్వామ్యం కావడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

# అమరావతికి చట్టబద్ధత...

అమరావతి- సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి పూర్తిస్థాయి చట్టబద్ధత కల్పించే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందుకు సంబంధించిన బిల్లును రాబోయే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టేందుకు కసరత్తు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ చర్యతో రాజధానిపై ఉన్న అనిశ్చితికి తెరపడనుంది. 2014లో రాష్ట్ర విభజన తర్వాత పదేళ్ల పాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా కొనసాగింది. 2024 జూన్ 2తో ఆ గడువు ముగియడంతో, ఏపీకి స్వతంత్ర రాజధానిని అధికారికంగా ప్రకటించాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో, అమరావతిని రాజధానిగా ఖరారు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల కేంద్రానికి ఒక నివేదిక పంపింది. రాజధాని ఎంపిక ప్రక్రియ, చేపట్టిన నిర్మాణాల వివరాలతో కూడిన నోట్‌ను సమర్పించింది. ఈ నివేదికను పరిశీలించిన కేంద్ర హోంశాఖ, దీనిపై తదుపరి చర్యలు ప్రారంభించింది. రాజధాని ఎప్పటి నుంచి అమల్లోకి రావాలో స్పష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరగా, 2024 జూన్ 2 నుంచే వర్తింపజేయాలని రాష్ట్రం విజ్ఞప్తి చేసింది. ఈ ప్రతిపాదనపై పట్టణాభివృద్ధి, న్యాయ, వ్యవసాయ శాఖలతో పాటు నీతి ఆయోగ్ అభిప్రాయాలను కూడా కేంద్ర హోంశాఖ సేకరిస్తోంది. అన్ని శాఖల నుంచి అభిప్రాయాలు అందిన తర్వాత ఈ ప్రతిపాదనను కేంద్ర క్యాబినెట్ ఆమోదానికి పంపనున్నారు. క్యాబినెట్ ఆమోదం లభించగానే, పార్లమెంట్ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో సవరణ కోసం బిల్లును ప్రవేశపెడతారు. ఈ చట్టసవరణతో అమరావతికి రాజధానిగా శాశ్వత భద్రత, చట్టపరమైన గుర్తింపు లభిస్తుంది.

# దుబాయ్ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు ఏపీ సిద్ధం...

(మొదటిపేజీ తరువాయి)

నెట్‌వర్క్ ఏపీలో ఉందని తెలిపారు. అంతేకాకుండా, రాష్ట్రం గుండా వెళ్తున్న జాతీయ పారిశ్రామిక కారిడార్లు లాజిస్టిక్స్‌కు మరింత ఊతమిస్తాయని యూఏఈ మంత్రికి వివరించారు. ఈ నేపథ్యంలో యూఏఈకి చెందిన డీపీ వరల్డ్, షరాఫ్ గ్రూప్, ట్రాన్స్‌వరల్డ్, ఏడీ పోర్ట్స్, యాడ్నాక్ వంటి ప్రతిష్టాత్మక కంపెనీలు ఏపీలో పారిశ్రామిక పార్కులు నెలకొల్పే అవకాశాన్ని పరిశీలించాలని చంద్రబాబు కోరారు. ఏపీ నుంచి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతితో పాటు, ఇక్కడే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు స్థాపించాలని సూచించారు. పునరుత్పాదక ఇంధన రంగంలోనూ ఏపీ అపార అవకాశాలను అందిస్తోందని సీఎం తెలిపారు. రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు యూఏఈకి చెందిన టాక్వా, మజ్దార్ వంటి కంపెనీలకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అదేవిధంగా, ఏడీఐఏ, ముబాద్లా, ఏడీక్యూ వంటి యూఏఈకి చెందిన సావరిన్ ఫండింగ్ సంస్థల ద్వారా పెట్టుబడులు పెట్టవచ్చని సూచించారు. వీటితో పాటు, ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చేయనున్న స్పేస్, డ్రోన్ సిటీల నిర్మాణంలోనూ యూఏఈ భాగస్వామ్యం కావాలని చంద్రబాబు ప్రతిపాదించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రతిపాదనలు, వివరించిన అవకాశాలపై యూఏఈ విదేశీ వాణిజ్య మంత్రి థాని బిన్ అహ్మద్ సానుకూలంగా స్పందించారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణాన్ని ఆయన ప్రశంసించినట్లు సమాచారం. ఈ సమావేశం ఏపీ-యూఏఈ వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని ఇరువర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

# ఫాలోఅప్ చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. అందుకే ప్రతీ యేడాది జులై లేదా ఆగస్టులో హైదరాబాద్‌లో ఫాలో-అప్ సదస్సు నిర్వహించాలని వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ప్రతినిధులకు ఆయన సూచించారు.

**హైదరాబాద్‌లో తొలి బ్యూటీ-టెక్ జీసీసీ**

కాగా ప్రపంచంలోనే తొలి బ్యూటీ-టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జీసీసీ)ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తామని లోరియల్ సంస్థ ప్రకటించింది. ఈ అత్యాధునిక కేంద్రాన్ని ఈ ఏడాది నవంబర్‌లో ప్రారంభించనుంది. దావోస్‌లో జరుగుతున్న డబ్ల్యూఈఎఫ్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డితో లోరియల్ సీఈవో నికోలస్ హియోరోనిమస్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులతో బ్యూటీ-టెక్ జీసీసీని ఏర్పాటు చేసే నిర్ణయాన్ని ఆయన వెల్లడించారు. ఈ ఏర్పాటుతో లోరియల్?కు గ్లోబల్ ఇన్నోవేషన్, టెక్నాలజీ, డేటా, సప్లై చైన్ కార్యకలాపాలకు హైదరాబాద్ కీలక కేంద్రంగా మారనుంది. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఏఐ, అనలిటిక్స్ రంగాల్లో రూపొందించే సాంకేతిక పరిష్కారాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న లోరియల్ యూనిట్లకు అందిస్తామని హియెరోనిమస్ ఈ సందర్భంగా తెలిపారు. దీంతో గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్ కార్యకలాపాలకు హైదరాబాద్ ప్రాముఖ్యత మరింత పెరుగనుంది. నవంబర్‌లో జీసీసీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రితోపాటు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్?బాబును లోరియల్ సంస్థ ఆహ్వానించింది. హైదరాబాద్ పెట్టుబడులకు అనువైన ప్రదేశమని శ్రీధర్ బాబు ఈ సందర్భంగా చెప్పారు. మెడ్‌టెక్, హెల్త్‌టెక్ మాత్రమే కాకుండా బ్యూటీ-టెక్ వంటి కొత్త విభాగాల్లోనూ తెలంగాణ అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే మారియెట్, వ్యాన్ గార్డ్, నెట్ ఫ్లిక్స్, మెక్ డోనాల్డ్స్, హినెకెన్, జాగర్, కోస్ట్కో వంటి గ్లోబల్ కంపెనీలు హైదరాబాద్‌లో జీసీసీలను ఏర్పాటు చేశాయన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ గురించి ప్రతినిధి బృందం ఈ సందర్భంగా డబ్ల్యూఈఎఫ్ ప్రతినిధులకు వివరించింది. జీసీసీతోపాటు మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుకు రాష్ట్రంలోగల అవకాశాలను పరిశీలించాలని లోరియల్ సంస్థ విభాగాధిపతులను వారు ఆహ్వానించారు. తెలంగాణలో ఉన్న మౌలిక వసతులు, పరిశ్రమల ఎకోసిస్టమ్‌ను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో తయారీ రంగంలోనూ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్టు హియెరోనిమస్ ఈ సందర్భంగా హామీనిచ్చారు.

**బ్లైజ్ కంపెనీ ఒప్పందం**

మరోవైపు కాలిఫోర్నియాకు చెందిన బ్లైజ్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఈ సంస్థ వ్యవస్థాపక సీఈవో దినాకర్ మునగాలా సీఎంతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. డేటా సెంటర్ అర్టిఫిషియల్ కంప్యూటింగ్?కు ఈ సంస్థ తక్కువ శక్తిని వినియోగించే హార్డ్‌వేర్, ఫుల్-స్టాక్ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయనుంది. బ్లైజ్? సంస్థ ఇప్పటికే హైదరాబాద్?లో రీసెర్చ్ అండ్ డెవెలప్‌మెంట్ ఇంజినీరింగ్ సెంటర్‌ను నిర్వహిస్తోంది. తన ఆర్ అండ్ డీ సెంటర్‌ను విస్తరించేందుకు వీలుగా పెట్టు బడులు, ప్రణాళికలపై ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు సీఎంతో చర్చించారు. హెల్త్‌కేర్ డయాగస్టిక్స్, మాన్యుఫ్యాక్చరింగ్ ఆటోమేషన్, ఎనర్జీ ఎఫిషియెన్సీ వంటి రంగాల్లో ఏఐ ద్వారా పరిష్కారాలను కనుగొనటం, వాటిని పైలట్ ప్రాజెక్టులుగా అమలు చేసేందుకు ఉండే అవకాశాలపై వారు సమాలోచనలు చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ తెలంగాణను ఏఐ డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దటమనేది వచ్చే రెండు దశాబ్దాల్లో మూడు ట్రిలియన్? డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యానికి అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, క్వాంటం కంప్యూటింగ్, హార్డ్‌వేర్, ఆటోమేషన్ రంగాల్లో తెలంగాణ వేగంగా ముందుకు సాగుతోందని అన్నారు. దేశంలోనే టెక్నాలజీ హబ్‌గా రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని తెలిపారు. బ్లైజ్ సంస్థకు సంబంధించిన ఆర్ అండ్ డీ యూనిట్ విస్తరణకు ప్రభుత్వం తగిన మద్దతు నిస్తుందని హామీనిచ్చారు. హైదరాబాద్?లో ఇటీవల నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని వివరించారు. రూ.5.75 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తమ ప్రభుత్వం ఆకర్షించిందని చెప్పారు. 'ప్రతీ యేడాది మేము ఎంవోయూలపై సంతకాలు చేయడానికి దావోస్‌కు వస్తాం.. కానీ ఈసారి గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావటంతో, తెలంగాణ రైజింగ్ విజన్, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పాలసీలను ప్రపంచానికి చూపించడానికి వచ్చాం” అని తెలిపారు. హైదరాబాద్? గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లకు ప్రధాన కేంద్రంగా మారిందని వివరించారు. మూసీ నది పునరుజ్జీవనంతోపాటు రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయటం ద్వారా నైట్ టైమ్ ఎకానమీపై దృష్టి సారిస్తామని చెప్పారు. తద్వారా దేశంలోనే 24 గంటలు పనిచేసే తొలి నగరంగా హైదరాబాద్?ను అభివృద్ధి చేస్తామన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 30 వేల ఎకరాల్లో భారత్? ఫ్యూచర్? సిటీని నిర్మిస్తున్నామని ప్రకటించారు. ఇందులో 50 శాతం కంటే ఎక్కువ గ్రీన్ కవర్ ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్?-2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలను ప్రదర్శించారు. అదే వేదికపై తెలంగాణ ఇన్నోవేషన్ హబ్ తెలంగాణ నెక్స్ట్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీలను ఆవిష్కరించారు. సమావేశంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిౌ హైదరాబాద్‌లో మెట్రో రైలు విస్తరణ, చెరువులు, కుంటల పునరుజ్జీవనం వంటి గేమ్-చేంజర్ ప్రాజెక్టులను వివరించారు. కొత్తగా ప్రతిపాదించిన కోర్, ప్యూర్, రేర్ అర్థిక వృద్ధి జోన్ల ప్రణాళికలను ప్రస్తావించారు. తెలంగాణకు అపారమైన పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని, సాంకేతికత, అనుభవం, నైపుణ్యాలపరంగా గ్లోబల్ కంపెనీల సహకారం స్వీకరిస్తామని వారు తెలిపారు.

**రూ.6 వేల కోట్లతో రియాక్టర్ విద్యుత్ ప్లాంట్**

కాగా క్లీన్? ఎనర్జీ రంగంలో తెలంగాణ మరో ముందడుగు వేసింది. రూ.6 వేల కోట్ల పెట్టుబడితో స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ (ఎస్ఎంఆర్) ఆధారిత విద్యుత్ ప్రాజెక్ట్ అభివృద్ధికి స్లోవాకియాకు చెందిన న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ ముందుకొచ్చింది. సీఎం రేవంత్ రెడ్డితో ఆ కంపెనీ ప్రతినిధులు భేటీ అయ్యారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి ఆ సంస్థ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈఓఐ)ను సమర్పించింది. స్లోవాకియాకు చెందిన ఐక్యూ క్యాపిటల్, భారత్‌కు చెందిన గ్రీన్ హౌస్ ఎన్విరో సంయుక్త భాగస్వామ్యంలో న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ ఏర్పడింది. గరిష్ఠంగా 300 మెగావాట్ల సామర్థ్యంతో తెలంగాణలో కొత్త విద్యుత్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను ఆ సంస్థ పరిశీలిస్తోంది. ఈ ప్రాజెక్ట్ మొత్తం పెట్టుబడి విలువ 600 మిలియన్ యూరోలు (సుమారు రూ.6,000 కోట్లు). ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూౌతెలంగాణ ప్రభుత్వం క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందన్నారు. 2047 నాటికి నెట్--జీరో అభివృద్ధి లక్ష్యాన్ని సాధించడంలో సుస్థిర అభివృద్ధే ప్రధానమని తెలిపారు.

**రూ.వెయ్యి కోట్ల పెట్టుబడికి సర్గాడ్ ఎంవోయూ**

విమానయాన రంగంలో పేరొందిన అమెరికా సంస్థ సర్గడ్.. మన రాష్ట్రంలో మెయింటెనెన్స్ అండ్ రిపేర్ యూనిట్ నెలకొల్పనుంది. రాబోయే మూడు నుంచి ఐదేండ్లలో దశలవారీగా రూ.వెయ్యి కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వంతో ఆ సంస్థ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో భాగంగా దావోస్‌లో, సర్గాడ్ కంపెనీ వ్యవస్థా పకుడు, సీఈఓ శ్రీనివాస్? తోట ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో భేటీ అయౌ ఈ మేరకు ఒప్పందాలు చేసుకున్నారు. తెలంగాణలో విమానాల నిర్వహణ, మరమ్మతులు, వాటి పునరుద్ధరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న ఆసక్తిని సంస్థ ప్రతినిధులు వ్యక్తం చేశారు.

**'శంకర వరప్రసాద్ గారూ సూపర్?**

ప్రముఖ నటుడు చిరంజీవి ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన తన కుటుంబంతో కలిసి కొద్ది రోజుల క్రితం స్విట్జర్లాండ్‌కు వెళ్లారు. ప్రస్తుతం చిరు అక్కడే ఉన్నారన్న విషయం తెలుసుకున్న సీఎం రేవంత్ రెడ్డి 'ఇక్కడే ఉన్నారుగా.. ఒక్కసారి దావోస్‌కు రండి' అంటూ ఆహ్వానించారు. దీంతో చిరంజీవి డబ్ల్యూఈఎఫ్ సదస్సుకు వెళ్లారు. ఈ సందర్భంగా సీఎం, చిరు పలు అంశాలపై ముచ్చటించుకున్నారు. ఇటీవల విడుదలైన 'మన శివశంకర వరప్రసాద్? గారు' సినిమాను తాను కుటుంబంతో కలిసి వీక్షించానని సీఎం చెప్పారు. ఆ సినిమాను ఎంతో ఆస్వాదించానని తెలిపారు. ఆ చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతున్న నేపథ్యంలో సీఎం, చిరంజీవికి అభినందనలు తెలిపారు.

# ఏడాదిన్నర తరువాత పాదయాత్ర

(మొదటిపేజీ తరువాయి)

అయ్యాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు తోడుగా నిలబడతామని అన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోందని, ప్రతి ఇంట్లో ఇప్పుడు అదే చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. ఇప్పటి నుండి ప్రతివారం ఒక నియోజకవర్గ నాయకులతో సమావేశం అవుతానని పేర్కొన్నారు. నాడు నేడు పూర్తిగా రివర్స్? అయిందని వివరించారు. దాదాపు తొమ్మిది లక్షలమంది పిల్లలు గవర్నమెంటు స్కూళ్ల నుండి చదువు మానేశారని వివరించారు. వైసిపి హయాంలో 43 లక్షల మంది చదివితే ప్రస్తుతం 33 లక్షల మంది మాత్రమే చదువుతున్నారని వివరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎనిమిది క్వార్టర్లు పెండింగ్ ఉందని పేర్కొన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఒక కుంభకోణమని వివరించారు. పూర్తయిన 10 కళాశాలలను ఈ ప్రభుత్వం అచ్చంగా ప్రైవేటీకరిస్తోందని పేర్కొన్నారు. ఎరువులు బ్లాక్?లో కొనాల్సి వస్తోందని, వ్యవసాయ రంగం నాశనం అయిందని అన్నారు. ఉచిత పంటలబీమా లేదని, సున్నావడ్డీరుణాలు అందడం లేదని పేర్కొన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, మద్దతు ధరలూ లేవని అన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, యువత, రైతులు, అక్కచెల్లెమ్మల కోసం గట్టిగా పోరాడుతామని, జనంలోకి వెళతామని తెలిపారు.

**సాల్మన్ కుటుంబానికి అండగా ఉంటాం**

పల్నాడు జిల్లా పిన్నెల్లిలో హత్యక గురైన మందా సాల్మన్ కుటుంబానికి అండగా ఉంటామని, న్యాయపోరాటం చేయడంతోపాటు మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని మృతుడి కుటుంబ సభ్యులకు జగన్? హామీఇచ్చారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు బుధవారం జగన్?ను కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. టిడిపి నేతలు చేస్తున్న అరాచకంతో ప్రజలు గ్రామంలో ఉండేందుకు భయపడిపోతున్నారని వివరించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత హత్యకు కారకులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

**రైతుల ఉసురు తీస్తున్నారు : నాగిరెడ్డి**

రాష్ట్రంలో వ్యవసాయాన్ని దెబ్బతీస్తూ రైతుల ఉసురు తీస్తున్నారని వైసిపి రైతు విభాగం నాయకులు ఎంవిఎస్.నాగిరెడ్డి అన్నారు. మాజీ మంత్రి సాకే శైలజానాథ్ మాట్లాడుతూ నిరుద్యోగులు, యువతకు ఉపాధి లేకుండా చేశారని అన్నారు.

# సంపాదకీయం

## బీజేపీలో యువతరం....



భారతీయ జనతా పార్టీలో తరాల మార్పు మొదలైంది. కొంతకాలంగా వినిపిస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ, బీజేపీ జాతీయ సారథ్య బాధ్యతలను యువ నాయకుడు నితిన్ నబిన్‌కు అప్పగించడం భారత రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. కేవలం 45 ఏళ్ల వయసులో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీకి అధ్యక్షుడవ్వడం అంటే అది సామాన్య విషయం కాదు. ఇది కేవలం ఒక నియామకం మాత్రమే కాదు, రాబోయే రెండు దశాబ్దాల రాజకీయాలను శాసించేలా మోదీ-షా ద్వయం రచించిన ఒక పకడ్బందీ వ్యూహం అని చెప్పొచ్చు.నితిన్ నబిన్ ఎదుగుదల వెనుక వారసత్వ రాజకీయాల నీడ లేదు.. కేవలం కఠోర శ్రమ, అంకితభావం మాత్రమే ఉన్నాయి. ఆయన రాజకీయ ప్రస్థానం బీహార్ గల్లీల నుండి మొదలైంది. భారతీయ జనతా యువమోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శిగా, బీహార్ యువమోర్చా అధ్యక్షుడిగా ఆయన పార్టీ క్యాడర్‌ను కింది స్థాయి నుండి నిర్మించారు. 2006లో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నితిన్, అప్పటి నుండి వెనుదిరిగి చూడలేదు. పాట్నాలోని బంకీపూర్ నియోజకవర్గం నుంచి వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడం ఆయన ప్రజాదరణకు నిదర్శనం. బీహార్ ప్రభుత్వంలో రోడ్లు, న్యాయశాఖ, పట్టణాభివృద్ధి వంటి కీలక శాఖల మంత్రిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. కేవలం పార్టీని నడపడమే కాకుండా, ప్రభుత్వాన్ని ఎలా నడపాలో కూడా తెలిసిన నాయకుడు కావడంతో అధిష్టానం ఆయన వైపు మొగ్గు చూపింది.బీజేపీలో ఎంతోమంది సీనియర్లు, హేమాహేమీలు ఉన్నప్పటికీ నితిన్ నబిన్ వైపే మొగ్గు చూపడానికి ప్రధాన కారణం ఆయనకున్న 'సమన్వయ కర్త' అనే ఇమేజ్. మోదీ-షాల వ్యూహాలను తు.చ. తప్పకుండా అమలు చేయడంలో ఆయన దిట్ట. పార్టీ గీసిన గీతను దాటకుండా, అందరినీ కలుపుకుపోవడం ఆయన ప్రత్యేకత. ఆయన కాయస్థ సామాజిక వర్గానికి చెందినవారు.

ఇది రాజకీయంగా తటస్థ వర్గంగా పరిగణించబడుతుంది. ఏ ఇతర బలమైన కుల వర్గాలతోనూ ఘర్షణ లేని నేపథ్యం కావడం వల్ల, దేశవ్యాప్తంగా ఉన్న వివిధ కుల సమీకరణాలను సమన్వయం చేయడం ఆయనకు సులభమవుతుంది. కాంగ్రెస్ పార్టీ 80 ఏళ్లు పైబడిన సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే సారథ్యంలో నడుస్తుంటే, బీజేపీ 45 ఏళ్ల యువకుడిని తెరపైకి తెచ్చి దేశ యువతకు ఒక బలమైన సంకేతాన్ని పంపింది.నితిన్ నబిన్ సామర్థ్యంపై అధిష్టానానికి పూర్తి నమ్మకం కలిగించింది 2023 ఛత్తీస్‌గఢ్ ఎన్నికలే. అప్పట్లో అక్కడ కాంగ్రెస్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ తిరుగులేని శక్తిగా ఉండేవారు. సర్వేలన్నీ బీజేపీ ఓడిపోతుందని చెప్పాయి. ఆ క్లిష్ట సమయంలో పార్టీ ఇన్‌చార్జ్‌గా వెళ్లిన నబిన్, తన మైక్రో మేనేజ్‌మెంట్ వ్యూహంతో అద్భుతం చేశారు. గ్రౌండ్ లెవల్‌లో బూత్ కమిటీలను బలోపేతం చేసి, కాంగ్రెస్ కోటను బద్దలు కొట్టి బీజేపీని అధికారంలోకి తెచ్చారు. ఇటీవల ఢిల్లీలో బీజేపీ తిరిగి తన ఉనికిని చాటుకోవడంలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు. కష్టమైన టాస్క్‌లను సైతం సైలెంట్‌గా పూర్తి చేసే 'ట్రబుల్ షూటర్'గా ఆయన పేరు తెచ్చుకున్నారు.నితిన్ నబిన్ ముందు ఇప్పుడు పూలపాన్పు లేదు, ముళ్ల బాట ఉంది. బీజేపీకి ఇప్పటికీ సవాల్‌గా ఉన్న దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీని విస్తరించడం ఆయన ప్రాథమిక లక్ష్యం. త్వరలో జరగబోయే బెంగాల్, ఉత్తరప్రదేశ్, అస్సాం ఎన్నికల్లో పార్టీ విజయం సాధించడం ఆయన సారథ్యానికి పరీక్షగా నిలవనుంది. 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి దేశంలో కొత్తగా చేరే కోట్లాది మంది యువ ఓటర్లను బీజేపీ వైపు తిప్పుకోవడం కోసం ఆయన తనదైన శైలిలో పార్టీని డిజిటల్, క్షేత్రస్థాయిలో ఆధునీకరించాల్సి ఉంది. తిన్ నబిన్ 1980 మే 23న జార్ఖండ్‌లోని రాంచీలో జన్మించారు. ఆయన తండ్రి నబిన్ కిశోర్ ప్రసాద్ సిన్హా, తల్లి మీరా సిన్హా. కిశోర్ సిన్హా సీనియర్ బీజేపీ నాయకుడు. ఆయన పాట్నా వెస్ట్ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు బీహార్ శాసనసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. కాగా, నితిన్ నబిన్ 1996లో పాట్నాలోని సెయింట్ మైఖేల్స్ హై స్కూల్ నుంచి పదో తరగతి పరీక్షలో పాసయ్యారు. ఆ తర్వాత ఢిల్లీలోని సీఎస్‌కేఎం పబ్లిక్ స్కూల్ నుంచి 1998లో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు.నితిన్ నబిన్.. దీప్‌మాలా శ్రీవాస్తవను వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇదిలా ఉండగా.. నితిన్ నబిన్ రాజకీయ ప్రస్థానం 2006 ప్రారంభమైంది. పాట్నా వెస్ట్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో గెలిచి.. రాజకీయాల్లోకి ప్రవేశించారు నితిన్. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత.. ఆయన బాంకిపూర్‌కు మారారు.

అప్పటి నుంచి 2010, 2015, 2020, 2025 అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తూ.. తన కంచుకోటను కాపాడుకున్నారు.నితీష్ కుమార్ నేతృత్వంలోని బీహార్ ప్రభుత్వంలో కూడా నితిన్ నబిన్ కీలక పదవుల్లో పనిచేశారు. 2021 ఫిబ్రవరి నుంచి 2022 ఆగస్టు వరకు రహదారుల నిర్మాణ శాఖ మంత్రిగా పనిచేశారు. 2025 ఫిబ్రవరి నుంచి 2025 డిసెంబర్ వరకు తిరిగి అదే శాఖ బాధ్యతలను చేపట్టారు. ఇక 2024 మార్చి 2025 ఫిబ్రవరి మధ్య.. ఆయన పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖతో పాటు న్యాయ మంత్రిత్వ శాఖను కూడా నిర్వహించారు. ఆయన మంత్రిగా ఉన్న కాలంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పట్టణ గృహనిర్మాణ కార్యక్రమాలు, సంక్షేమ చర్యలపై దృష్టి సారించారు.బీజేపీ యువ విభాగం నుంచి వచ్చిన నబిన్.. సంస్థాగతంగా పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. గతంలో నితిన్ బీజేపీ యువ మోర్చా (బీజేవైఎం) జాతీయ ప్రధాన కార్యదర్శిగా, బీజేవైఎం బీహార్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. ఇదే సమయంలో జమ్మూకాశ్మీర్‌లో జరిగిన జాతీయ ఐక్యతా యాత్ర, 1965 యుద్ధంలో వీరమరణం పొందిన అమరవీరులకు నివాళులర్పిస్తూ గౌహతి నుంచి తవాంగ్ వరకు నిర్వహించిన పాదయాత్ర సహా అనేక పార్టీ ప్రచార కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు.మరోవైపు, బీజేపీ సిక్కిం ఇంచార్జిగా, ఛత్తీస్‌గఢ్ కో- ఇంచార్జిగా నితిన్ నబిన్ పనిచేశారు. ఆయా రాష్ట్రాల్లో పార్టీ బలోపేతంలో కీలక పాత్ర పోషించారు. 2025 డిసెంబర్‌లో బీజేపీ పార్లమెంటరీ బోర్డు.. ఆయన్ను పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించింది. మొత్తానికి, నితిన్ నబిన్ నియామకంతో బీజేపీ ఒక కొత్త శకానికి నాంది పలికింది. అమిత్ షా చాణక్యం, మోదీ చరిష్మాకు నితిన్ నబిన్ యువశక్తి తోడైతే.. రాబోయే ఎన్నికల్లో బీజేపీ దూసుకుపోవడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది కేవలం పార్టీ అధ్యక్ష పదవి మార్పు కాదు, 2029లో సరికొత్త రికార్డులను సృష్టించేందుకు వేసిన 'మాస్టర్ ప్లాన్'.

# ఏపీలో కొత్త పార్టీలు

**విజయవాడ - సూర్య వాస్తవం :**

ఏపీలో కొత్త పార్టీలు రానున్నాయా? ఆ స్పేస్ ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ఏపీలో ప్రాంతీయ పార్టీల హవా నడుస్తోంది. జాతీయ పార్టీల ప్రభావం అంతంత మాత్రమే. అధికార టిడిపి, జనసేనలు ప్రాంతీయ పార్టీలు. వాటితో అధికారం పంచుకున్న బిజెపి జాతీయ పార్టీ. మరో ప్రతిపక్ష పార్టీగా వైసీపీ ఉంది. అది సైతం ప్రాంతీయ పార్టీ. ఇంకా చిన్నచితకా పార్టీలు ఉండనే ఉన్నాయి. అయితే ఇప్పుడు ప్రాంతీయ పార్టీల ఏర్పాటు అంశం అనేది హాట్ టాపిక్ అవుతోంది. ప్రధానంగా ఏబీ వెంకటేశ్వరరావు, విజయసాయిరెడ్డి, షర్మిలాలు కొత్త పార్టీలు పెడతారని ప్రచారం నడుస్తోంది. అయితే ఈ ముగ్గురు పార్టీలు పెడితే ఎవరికి నష్టం అంటే మాత్రం.. కచ్చితంగా జగన్మోహన్ రెడ్డికి. అయితే ఆ ముగ్గురు టార్గెట్ సైతం జగన్మోహన్ రెడ్డి పార్టీ అని తెలుస్తోంది. వారి పార్టీల ఏర్పాటు వెనుక కూడా ఒక రకమైన వ్యూహం ఉన్నట్లు సమాచారం. అయితే వారి పార్టీ ప్రకటన నేరుగా లేదు కానీ ప్రచారం మాత్రం జరుగుతోంది. ఏబీ వెంకటేశ్వరరావు జగన్మోహన్ రెడ్డి సర్కార్ బాధిత అధికారి. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి సర్కార్లు ఆయన ఇంటలిజెన్స్ అధికారిగా పనిచేశారు. అప్పట్లో వైసీపీ ఎమ్మెల్యేలు చాలామంది టీడీపీలో చేరారు. ఆ సమయంలో నిఘా అధిపతిగా ఉన్న ఆయన టిడిపికి అనుకూలంగా పనిచేశారన్న అనుమానం జగన్ లో ఉండేది. అందుకే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితుడిగా మారారు ఏబీ వెంకటేశ్వరరావు. ఈ రాష్ట్రానికి డిజిపి కావాల్సిన



అధికారి లూప్ హోల్స్ లో ఉండిపోయారు. ప్రమోషన్ పొందిన నాడే పదవీ విరమణ చేశారు. అయితే ఇంతటి మూల్యాన్ని చెల్లించుకున్న తనకు తెలుగుదేశం అధికారంలోకి వస్తే మంచి గుర్తింపు ఉంటుందని భావించారు. అయితే తన ఆలోచనకు తగ్గట్టు టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గుర్తింపు, పదవి దక్కలేదు. పైగా తాను ఆశించినట్టు వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డికి ట్రీట్మెంట్ ఇవ్వడం లేదన్న ఆవేదన ఉంది. మరోవైపు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సైతం తనకు ఇబ్బందులు ఉన్నాయి. అందుకే ఆయన కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తానని ఇటీవల ప్రకటించారు.మరోవైపు విజయసాయిరెడ్డికొత్త పార్టీ పెడతారన్న ప్రచారం నడుస్తోంది. ఏడాది కిందట ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. రాజ్యసభ సభ్యత్వంతో పార్టీకి కూడా రాజీనామా చేశారు. ఇకనుంచి వ్యవసాయం చేసుకుంటానని చెప్పుకొచ్చారు.. అయితే ఆయన రూటు మార్చినట్టు కనిపిస్తున్నారు. ఇటీవల నిత్యం జగన్ కోటరిని టార్గెట్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో రెడ్డి సామాజిక వర్గాన్ని ఆకర్షించే వీలుగా ఒక కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. దీని వెనుక తెలుగుదేశం హస్తం ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. వచ్చే ఎన్నికల్లో మరోసారి రెడ్డి సామాజిక వర్గం మద్దతు జగన్మోహన్ రెడ్డికి దక్కకుండా విజయసాయిరెడ్డి తో పార్టీని ఏర్పాటు చేయిస్తున్నారన్న ప్రచారం మాత్రం జరుగుతోంది.వైయస్ షర్మిల కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెబుతారని కూడా టాక్ నడుస్తోంది. తెలంగాణలో తన తండ్రి పేరిట పార్టీ ఏర్పాటు చేసిన షర్మిల అక్కడ నడపలేకపోయారు. కాంగ్రెస్ పార్టీలో చేరి ఏపీ పగ్గాలు అందుకున్నారు. సోదరుడు జగన్తో వచ్చిన విభేదాలతో ఆయనను అధికారం నుంచి దూరం చేయాలని చూసారు. ఆ విషయంలో సక్సెస్ అయిన ఏపీలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కాలేదు. అందుకే కాంగ్రెస్ అధినాయకత్వం షర్మిలను తప్పిస్తుందన్న ప్రచారం నడుస్తోంది. ఈ తరుణంలో ఆమె ప్రత్యేక రాయలసీమ సాధన కోసం ఒక పార్టీని ఏర్పాటు చేస్తారని టాక్ నడుస్తోంది. ఇటీవల రాజకీయంగా యాక్టివిటీస్ తగ్గించారు షర్మిల. అందుకే ఈ ప్రచారం మరింతగా సాగుతోంది. అయితే వీరు రాజకీయ పార్టీలు ఏర్పాటు చేస్తారు అనేది ఒక్క ప్రచారం మాత్రమే. వారు పార్టీలు ఏర్పాటు చేస్తే మాత్రం అది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బంది కలిగించే విషయమే.

# టీడీపీలో సెకండ్ జనరేషన్

**విజయవాడ - సూర్య వాస్తవం**



తెలుగుదేశం పార్టీ రాజకీయ ప్రయాణం ఇప్పుడు ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. ఈ మార్చితో పార్టీకి 44 సంవత్సరాలు పూర్తయి 45వ సంవత్సరంలోకి అడుగు పెడుతోంది. పార్టీ ఆవిర్భావ సమయంలో యువకులుగా రాజకీయాల్లోకి వచ్చిన చాలా మంది నేతలు ఇప్పుడు వయోభారంతో సీనియర్ స్థాయికి చేరుకున్నారు. అప్పట్లో అన్న ఎన్టీఆర్ చేతుల మీదుగా తొలి టికెట్ తీసుకుని అసెంబ్లీలో అడుగుపెట్టిన యువ నాయకులే, నేడు పార్టీలో అత్యంత అనుభవజ్ఞులుగా గుర్తింపు పొందుతున్నారు. కాలం మారినట్లే, రాజకీయాల్లోనూ మార్పు అవసరమన్న ఆలోచనలు ఇప్పుడు ఆ సీని యర్లలో మొదలయ్యాయని పార్టీ వర్గాలు చెబుతు న్నాయి. ఆంధ్రప్రదేశ్ అంతటా చూస్తే, టీడీపీలోని సీనియర్ నేతల నుంచి ఒకే రకమైన మాట వినిపి స్తోంది. తాము ఇక రాజకీయాల నుంచి తప్పుకోవాలని, యువతకు అవకాశం ఇవ్వాలని పలువురు బపి ారంగంగానే చెబుతున్నారు. ఇది ఒకరిద్దరి అభిప్రాయం మాత్రమే కాకుండా, చాలా జిల్లాల్లో వినిపిస్తున్న స్వరం కావడం విశేషం. ఈ జాబితా ఎంత పెద్దదంటే, ఒక ప్రాంతీయ పార్టీలో ఇంతమంది నేతలు ఒకేసారి పక్కకు తప్పుకునే పరిస్థితి దేశ రాజకీయాల్లో అరుదేనని చర్చ సాగుతోంది.సాధారణంగా రాజకీయాల్లో వయస్సుతో సంబంధం లేదని, చివరి శ్వాస వరకూ కొనసాగుతా మని చెప్పే నాయకులు ఎక్కువ. కానీ టీడీపీ సీనియర్లు మాత్రం భిన్నంగా ఆలోచిస్తున్నారని అంటున్నారు. దీనికి ప్రధాన కారణంగా రాబోయే ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం ఇవ్వాలన్న పార్టీ వ్యూహం ఉందన్న ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా నారా లోకేష్ నాయకత్వం మరింత బలపడుతూ, ఆయన చుట్టూ కొత్త తరం నాయకుల బృందం తయారవుతుందని భావిస్తున్నారు. ఈ మార్పును దృష్టిలో పెట్టుకుని, ముందుగానే తాము తప్పుకుంటే మంచిదన్న ఆలోచన సీనియర్లలో ఏర్ప డినట్టు చెబుతున్నారు. ఇదే సమయంలో మరో వ్యూహాత్మక ఆలోచన కూడా ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. గతంలో చంద్రబాబు నాయుడు వద్ద తాము కీలక పాత్ర పోషించినట్లే, ఇప్పుడు తమ వారసులను లోకేష్ టీంలోకి చేర్చితే భవిష్యత్తులో కుటుంబ రాజకీయాలకు భరోసా ఉంటుందన్న భావన కూడా ఈ నిర్ణయాల వెనుక ఉందని అంటున్నారు. "దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి" అన్న సామెత రాజకీయాల్లో ఉన్నవారికి మరింత వర్తి స్తుందన్న మాట వినిపిస్తోంది.ఇటీవల నర్సీపట్నం లో జరిగిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు తనకు 70 ఏళ్లు వచ్చాయని, ఇక రాజకీయాలకు గుడ్‌బై చెప్పాలని వేదికపైనే ప్రకటించడం పెద్ద చర్చకు దారితీసింది. ఆయన కుమారుడు విజయ్ పాత్రుడుకు వచ్చే ఎన్నికల్లో అవకాశం కల్పించాలన్న ప్రయత్నం జరుగుతోందన్న ప్రచారం కూడా ఉంది. అదే విధంగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా వయో పరంగా అదే దశకు చేరుకుంటుండటంతో, ఆయన కుటుంబ వార సత్వంపై దృష్టి పెట్టారని అంటున్నారు. ఈ జాబితాలో బండారు సత్యనారాయణ మూర్తి, కిమిడి కళా వెంకటరావు, దాడి వీరభద్రరావు వంటి పలువురు ప్రముఖులు ఉన్నారు.

ఒక అంచనాగా చూస్తే 2029 ఎన్నికల నాటికి కనీసం ముప్పయి నుంచి నలభై మంది సీనియర్ నేతలు రాజకీయాల నుంచి తప్పుకునే అవకాశం ఉందన్న మాట వినిపిస్తోంది. అదే సంఖ్యలో కొత్త తరం నాయకులు రంగప్రవేశం చేసే అవకాశమూ ఉందని అంటున్నారు. ఈ మార్పులను టీడీపీ హైకమాండ్ ఎలా సమతుల్యం చేస్తుంది, అనుభవం? యువత మధ్య సమన్వయాన్ని ఎలా సాధిస్తుంది అన్నదే ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ప్రధాన చర్చగా మారింది.

# కార్యకర్తలు సరే... లీడర్లు ఎక్కడ

**కడప - సూర్య వాస్తవం**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాబోయే ఎన్నికల్ని లక్ష్యంగా చేసుకుని తన వ్యూహాలను పునర్వ్యవస్థీకరించుకునే ప్రయత్నంలో ఉంది. ప్రధానంగా ప్రజల మధ్యకు వెళ్లడం, ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడం, వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావడం అన్నదే పార్టీ ముందున్న ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే ఈ లక్ష్యాలు కార్యరూపం దాల్చడంలో మాత్రం స్పష్టత కొరవడినట్టు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని పార్టీ నిర్ణయించినప్పటికీ, ఆ ఉద్యమాలు పరిమిత స్థాయిలోనే కొనసాగుతున్నాయి. ఎక్కువగా కార్యకర్తలు, స్థానిక నాయకులకే ఈ బాధ్యతలు అప్పగించడంతో ప్రజల్లోకి బలమైన సంకేతం వెళ్లడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాదాపు గత ఇరవై నెలలుగా పార్టీ చేపట్టిన పలు కార్యక్రమాల్లో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొనకపోవడం గమనార్హం. అంతేకాదు, ఆయనకు సన్నిహితుడిగా భావించే సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి కూడా ఈ కార్యక్రమాల్లో ఎక్కడా కనిపించలేదు.ఈ పరిస్థితుల్లో పార్టీ పోరాటాలు కేవలం



కార్యకర్తల స్థాయికే పరిమితమయ్యాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల మధ్యకు వస్తానని జగన్మోహన్ రెడ్డి గతంలో రెండు సార్లు తేదీలు ఇచ్చారన్న ప్రచారం జరిగింది. గత ఏడాది జూలై నెలలో ప్రజల్ని కలుస్తానని చెప్పినా, అది కేవలం కొద్ది సమయం పర్యటనకే పరిమితమైంది. ఆ తర్వాత ఈ ఏడాది జనవరి నుంచి విస్తృతంగా ప్రజల్లోకి వస్తానన్న మాట కూడా వాయిదా పడింది. తాజాగా పార్టీ వర్గాల్లో పాదయాత్రే తుది నిర్ణయం అన్న చర్చ నడుస్తోంది.అయితే ఈ పాదయాత్ర ఎప్పుడు అనే దానిపై స్పష్టత లేదు. పార్టీ నాయకుల మాటల్లో చెప్పాలంటే 2027 లేదా 2028 వరకూ దీనికి ముహూర్తం ఉండకపోవచ్చని అంటున్నారు. ఇప్పుడే పాదయాత్ర చేపట్టినా ఎన్నికలకు ఇంకా సమయం ఎక్కువగా ఉండటంతో దాని ప్రభావం తగ్గిపో తుందనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకుంటు న్నారని సమాచారం. అందుకే ఎన్నికలకు ఒకటి లేదా రెండు సంవత్సరాల ముందు మాత్రమే పాదయాత్ర ప్రారంభించే యోచనలో ఉన్నారని చెబుతున్నారు. ఇదిలా ఉండగా, మధ్యలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు , కార్పొరేషన్ ఎన్నికలు పార్టీకి కీలకంగా మారనున్నాయి. ఈ ఎన్నికల్లో వైసీపీ ఎలా ముందుకు సాగుతుంది, ఎలాంటి వ్యూహాలు అమలు చేస్తుందన్నది పెద్ద ప్రశ్నగా మారింది. పైగా జగన్మోహన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై కూడా చర్చ సాగుతోంది. ఆయన మోకాళ్ల సమస్యతో పాటు నడుము నొప్పితో బాధపడుతున్నారని ప్రచారం ఉంది. బహిరంగంగా చెప్పకపోయినా, గత కొన్నేళ్లుగా ఆయన వ్యవహార శైలిని గమనిస్తే ఆరోగ్య ఇబ్బందులు ప్రభావం చూపుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొంటూ వైసీపీ భవిష్యత్ అడుగులు ఎలా ఉండబోతాయన్నదే రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

## ఎడాల ప్రసాద్‌కు శ్రద్ధాంజలి ఘటించిన తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** వేంపల్లి బలిజ వీధికి చెందిన ఎడాల సుబ్బారావు కుమారుడు 23 సంవత్సరాల వయసుగల ఎడాల ప్రసాదు బుధవారం హార్ట్ ఎటాక్‌తో పరమపదించారు. రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, వేమయ్య, ఉత్తన్న,తోపి రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,వినయ్, నాగిశెట్టి శ్రీనివాసులు ప్రసాద్ భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రసాద్ పవిత్ర ఆత్మకు పరమేశ్వరుడు ప్రశాంతిని ప్రసాదించాలని ప్రార్థించారు. ప్రసాదు తండ్రి సుబ్బారావును, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ఆలయాలలో నాయిబ్రాహ్మణులను నియమించండి

### - బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్



**వేంపల్లె - సూర్య వాస్తవం :** వేంపల్లి వృషబాచలేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయాలలో నాయి బ్రాహ్మణులను నియమించాలని భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరి ప్రసాద్ అన్నారు. ఈ మేరకు వేంపల్లి శ్రీలక్ష్మివృషబాచలేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారిగా బాధ్యతలు చేపట్టిన కడప సుభాష్ ను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవస్థానంనకు దాదాపు వంద కోట్ల మేర ఆస్తులతో పాటు ఏటా కోటి రూపాయలు ఆదాయం వస్తున్నా సాంకేతిక కారణాలను బూచిగా చూబుతూ గత ప్రభుత్వం తొలగించిందని చెప్పారు. ఆలయాలలో పూజా కార్యక్రమాలలో భజంత్రిలు తప్పనిసరిగా ఉండాలి కాబట్టి తప్పనిసరిగా వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేషనల్ కౌన్సిల్ సభ్యులు కే రామచంద్రారెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబోయిన రవి యాదవ్,ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముద్ది శివ కృష్ణ, మునగల రాము గణేష్ రెడ్డి హరీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అగ్నికి ఆహుతైన అరటి పంటకు ఆర్థిక సాయం అందించాలి

### - కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ధ్రువకుమార్ రెడ్డి



**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందుల మండలంలోని ఈ.కొత్తపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న మోట్నూతలపల్లి గ్రామ రైతులు రామచంద్రుడు, భీమ్లా నాయక్ లకు సంబంధించిన అరటి పంటలు అగ్నికి ఆహుతై పూర్తిగా కాలిపోయినట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ మూలంరెడ్డి ధ్రువ కుమార్ రెడ్డి అన్నారు. వీరికి సంబంధించి దాదాపు ఐదు ఎకరాల్లో 8 వేల అరటి చెట్లు కాలిపోయాయని, ప్రభుత్వం తగిన ఆర్థిక సాయం అందజేసి ఆ రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ విషయాన్ని ఏపిసిసి చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి , ముఖ్య అధికార ప్రతినిధి డా.ఎన్. తులసిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి ల దృష్టికి తీసుకెళ్తామని, రైతులకు జరిగిన నష్టాన్ని వివరిస్తామన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం ద్వారా నష్టం పరి హారం అందేందుకు కృషి చేస్తామన్నారు. బుధవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన అగ్నికి ఆహుతైన అరటి పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు బద్రీనాథ్, పులివెందుల మండల ఉపాధ్యక్షుడు చంద్రబాబు, బీసీ నేత నాగరాజు, వినయ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** ఈనెల 23న మంత్రి లోకేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# టీడీపీ పాలనలో తెలుగు భాషకు చంద్రగ్రహణం సిగ్గుచేటు : తులసి రెడ్డి

**వేంపల్లె - సూర్య వాస్తవం :** తెలుగుదేశం పాలనలో రాష్ట్రంలో తెలుగు భాషకు చంద్రగ్రహణం పట్టడం అత్యంత దురదృష్టకరం, శోచనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. బుధవారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం 2019 నవంబర్ 20వ తేదీన పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ దాని స్థానంలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడుతూ జీవో 85 జారీ చేసిందన్నారు. ఇది ఒక చారిత్రాత్మకమైన తప్పిదమైన జీవో కాగా ఆ జీవోను ప్రస్తుతం చంద్రబాబు నేతృ త్వంలోని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తూ ఉండడం మరింత దురదృష్టకరం, శోచనీయం అన్నారు. ఇది ఇలాగే కొనసాగితే మధురమైన మన మాతృభాష తెలుగు భాష అనతి కాలములోనే మృతభాషగా మారుతుందన్నారు. ప్రపంచంలో 200 పైచిలుకు దేశాలు ఉండగా అభివృద్ధి చెందిన దేశాలతో పాటు ప్రతి దేశం కూడా పాఠశాల విద్యను ప్రత్యేకించి ప్రాథమిక విద్యను తమ తమ పిల్లలకు మాతృభాషలోనే బోధన చేస్తున్నాయన్నారు. భారతదేశంలో 28 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్రపాలిత ప్రాంతాలు ఉండగా ఒక్క ఆంధ్రప్రదేశ్ తప్ప మిగతా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ప్రాథమిక విద్యను తమ పిల్లలకు తమ తమ మాతృభాషలోనే బోధిస్తున్నాయన్నారు. దేశంలోనే తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్లో తెలుగు భాషకు ఈ దుస్థితి రావడం విడ్డూరం. స్వర్గీయ ఎన్టీ రామారావు తెలుగు భాష, తెలుగు జాతి, తెలుగువారి ఆత్మగౌరవం కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించారు. అటువంటి తెలుగుదేశం పాలనలో తెలుగు భాషకు ఈ దుర్గతి రావడం అత్యంత విచారకరం. జాతిపిత మహాత్ముడు, విశ్వకవి రవీంద్రుడు క్షిపని పితామహుడు అబ్దుల్ కలాం, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వీరందరు కూడా ప్రాథమిక విద్యను మాతృభాషలోనే బోధించాలని చెప్పారు. విద్యా హక్కు చట్టం,జాతీయ విద్యా విధానం, భారత రాజ్యాంగంలో 350 ఏ అధికరణ, యునెస్కో, ఐక్యరాజ్యసమితి ఇవన్నీ కూడా మాతృభాషకు పెద్దపీట వేశాయి. ఒక అంశం మీద ఒక విద్యార్థి ఒక గంటలో మాతృభాషలో అవగాహన చేసుకుంటే ఇతర భాషల్లో అదే అంశాన్ని అవగాహన చేసుకోవాలంటే నాలుగు గంటలు పడుతుందని మనో విశ్లేషకులు చెబుతున్నారు. నోబెల్ ప్రైజ్ గ్రహీతలు అందరూ కూడా ప్రాథమిక విద్యను తమ తమ మాతృభాషలోనే నేర్చుకున్న వారే డిమాండ్లు.



1. గత వైకాపా ప్రభుత్వం జారీచేసిన జీవో 85ను కూటమి ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి.
2. ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో ప్రాథమిక విద్యలో తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరి చేయాలి.
3. తెలుగు మధ్యమంలో చదివిన వారికి ఉన్నత విద్య ప్రవేశాలలో ఉద్యోగాలలో రెండు శాతం వెయిటేజ్ మార్కులు కలపాలి.

మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రమణ్యం, ప్రసాద్ గౌడ్,విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి,వేంపల్లి మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,బండారు వెంకటేశు చిన్నకోట నాగరాజు, నామ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

### - ప్రజాదర్బార్‌లో బీటెక్ రవి





**పులివెందుల- సూర్య వాస్తవం :** పులివెందుల నియోజకవర్గ ప్రజల కష్టాలను తీర్చి, వారికి అండగా నిలవడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి ,వేంపల్లె టీడీపీ ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పులివెందుల పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజాదర్బార్' కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు తమ సమస్యలను బీటెక్ రవికివిన్నవించుకున్నారు. ప్రజల నుండి అర్జీలను స్వీకరించిన బీటెక్ రవి, అక్కడికక్కడే సమస్యల తీవ్రతను బట్టి సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. సామాన్యులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకుండా తక్షణ పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. పులివెందుల అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి మేము కట్టుబడి ఉన్నాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## 25న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

### శ్రీ బావసార క్షత్రియ కళ్యాణ మండపం

**పామిడి - సూర్య వాస్తవం :** పామిడిలో ఈనెల 25-01-26 ఆదివారం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగు ళూరు శంకర కంటి ఆసుపత్రి వారు ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లైన్స్ క్లబ్ వ్యవ స్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు, లైన్స్ క్లబ్ అధ్యక్షుడు రఘువీర్, లైన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు కంటి చూపు మందగించిన వారిని పరీక్షించి అవసరమైతే అన్ని రకాల కంటి ఆపరేషన్లకు ఉచితంగా ఆపరేషన్లు చేస్తారు. శంకర కంటి ఆసు పత్రి వారు ప్రత్యేక బస్సుల్లో బెంగళూరుకు తీసుకెళ్లి ఆపరేషన్లు అనంతరం తిరిగి గమ్యస్థానాలకు చేరుస్తారని లైన్స్ క్లబ్ సభ్యులు తెలియజేశారు కంటి వైద్య శిబిరానికి హాజరయ్యే వారు రెండు ఆధార్ కార్డు జిరాక్స్ రెండు పాస్పోర్ట్ సైజు ఫోటోలు తీసుకొని రావాలని తెలియజేశారు. ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని పామిడి మండల ప్రజలు,పామిడి చుట్టూ ప్రక్కల ఉన్నటువంటి మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు, రఘువీర్ కోరారు.



## సూర్య వాస్తవం, డైరీని ఆవిష్కరించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు లక్ష్మణ్ రెడ్డిలు




**కడప /అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** సూర్య వాస్తవం 2026 డైరీనీ బుధవారం రాష్ట్ర రవాణా యువజన. క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, సోదరుడు లక్ష్మణ్ రెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సూర్య వాస్తవం పత్రిక రీజనల్ మేనేజర్ ఆరిఫ్ అలీ చాలా మంచి వారిని తాను గతంలో నేటి దినపత్రిక సూర్య పత్రికను నడిపించి చివరకు తానే స్వయాన సూర్య వాస్తవం పేపర్ ను పెట్టుకోవడం చాలా సంతోషించదగ్గ విషయం అన్నారు. అంతేకాకుండా బ్యూరో వలి భాషా కూడా నాకు గత 20 ఏళ్లుగా పరిచయం అని చాలా పత్రికల్లో పని చేసి పలువురి వద్ద మన్ననలు పొందారన్నారు. అంతేకాకుండా పత్రికకు కావాల్సిన సహాయ సహకారాలు ఏమైనా తన వంతు చేస్తానని ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో తోటి నాయకులు అభిమానులు సమక్షంలో డైరీని ప్రారంభించారు.




## నూతన సంయుక్త కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శివ నారాయణ శర్మ

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** అన్నమయ్య జిల్లా నూతన సంయుక్త కలెక్టర్గా శివ నారాయణ శర్మ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ముందుగా నూతన సంయుక్త కలెక్టర్ అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ను గౌరవపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా సంయుక్త కలెక్టర్‌తో పలు విషయాలు చర్చించారు. అనంతరం వేద పండితులు వేదమంత్రాలతో ఛాంబర్ లోకి ఆహ్వానం పలకగా నూతన సంయుక్త కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ....గౌరవ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా సర్వతో ముఖాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని, అధికారుల సహకారంతో అన్నమయ్య జిల్లాను రాష్ట్రస్థాయిలో ఉత్తమ జిల్లాగా నిలబెట్టేందుకు కృషి చేస్తానన్నారు. నూతన సంయుక్త కలెక్టర్‌ను మదనపల్లి సబ్ కలెక్టర్ కళ్యాణి, డిఆర్ఓ మధుసూదనరావు, కలెక్టరేట్ ఏవో నాగభూషణం, కలెక్టరేట్ సిబ్బంది, వివిధ శాఖల జిల్లా అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



# భళా రంగోత్సవ్

- ఉల్లాసంగా.. ఉత్సాహంగా ముగిసిన రంగోత్సవ్ - 2026 పోటీలు
- రంగోత్సవ్‌తో విద్యార్థుల కళాత్మక ప్రతిభకు మెరుగులు,
- డిఈఓ సుబ్రహ్మణ్యం వెల్లడి



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** విద్యార్థుల్లో దాగి ఉన్న వివిధ రకాల కళానైపుణ్యాలను వెలికతీయడమే రంగోత్సవ్ లక్ష్యమని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. డైట్ లో బుధవారం రంగోత్సవ్ - 2026 జిల్లాస్థాయి పోటీలను జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న కళా నైపుణ్యాలకు మెరుగులు దిద్దేందుకు, వారిని ప్రోత్సహించేందుకు రంగోత్సవ్ తోడ్పడుతుందన్నారు. పాఠాలు చదువుతూ బిజీగా ఉండే విద్యార్థులు వివిధ సాంస్కృతిక పోటీల్లో సత్తా చాటడం మంచి పరిణామమన్నారు. ఇది ఆనందకర అభ్యాసానికి దారితీస్తుందన్నారు. అనంతరం రంగోత్సవ్ జిల్లా నోడల్ అధికారి మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ చిత్రలేఖనం, చేతిరాత, ముగ్గుల పోటీ, జానపద నృత్యం, పాత్రాభినయం వంటి 5 కళారూపాలలో వివిధ పాఠశాలలకు సంబంధించి 146 మంది విద్యార్థిని విద్యార్థులు పోటాపోటీగా ఆద్యంతం ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. జిల్లాస్థాయి పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విజేతలకు డీఈవో మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారన్నారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం పొంది విజేతలుగా ఎంపికైన వారు అక్టోబర్ 23 వతేదీ రాష్ట్రస్థాయిలో విజయవాడలోని మురళి రిసార్ట్స్ నందు నిర్వహించే రంగోత్సవ్ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

**రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విజేతలు వీరే...**




జిల్లా స్థాయిలో జరిగిన రంగోత్సవం పోటీలలో పాల్గొని ప్రథమ స్థానం పొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారి వివరాలు ఇలా ఉన్నాయి. చిత్రలేఖనంలో పి శృతి, జడ్పీ హైస్కూల్, పెదివీడు రెడ్డివారిపల్లి ,వీరబల్లి మండలం, చేతి వ్రాతలో జి నందిని, జడ్పీ హైస్కూల్, కొత్తపేట రామాపురం, రాయచోటి మండలం, ముగ్గుల పోటీలో జడ్పీ హైస్కూల్, నల్లపురెడ్డిపల్లి, పెనగలూరు మండలానికి చెందిన హిమజ, తులసి, ఝాన్సీ, మేనక బృందం, జానపద నృత్యంలో జడ్పీ హైస్కూల్, కొత్తపేట రామాపురం, రాయచోటి మండలానికి చెందిన గీతాంజలి, హేమశ్రీ, రిషిత, జయశ్రీ బృందం, పాత్రాభినయంలో నందు జడ్పీ హైస్కూల్, కొత్తపేట రామాపురం, రాయచోటి మండలానికి చెందిన లక్ష్మి ప్రసన్న, జస్వంత్, ధనుష్, మధు కుమార్ లు రాష్ట్ర స్థాయి రంగోత్సవ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ పరీక్షల అధికారి కొండూరు శ్రీనివాసరాజు, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రకాష్ రెడ్డి, డైట్ అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పెనుజూరు అనసూయమ్మ నేత్రదానం

- ఇద్దరు అంధులకు చూపు





**పులివెందుల- సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణం పార్నపల్లి రోడ్‌లోని ఘంటమస్తాన్ వీధికి చెందిన పెనుజూరు అనసూయమ్మ (93 సంవత్సరాలు) మరణించడం తో ఆమె కుమారుడు నరసింహులు, కోడలు భారతి, మనవళ్లు వికాస్ కుమార్, వినోద్ కుమార్, భార్గవ్, మనవరాళ్లు ధనలక్ష్మి, విజయలక్ష్మిలు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ మరియు స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు లకు సమాచారం ఇవ్వడం తో టెక్నీషియన్ ప్రశాంత్ కుమార్ తో కలిసి మృతురాలి ఇంటివద్ద పార్థివ దేహం నుండి కార్నియా లను సేకరించి కడప ఎల్ వి ప్రసాద్ నేత్రాలయానికి పంపినట్లు రాజు తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కుటుంబం లోని వ్యక్తి లేదా సన్నిహితులు ఎవరు మరణించిన వయసు పరిమితం లేకుండా నేత్రదానం చేసేందుకు 9966509364 కి సంప్రదించవలసినదిగా ఆయన కోరారు. ఒక మనిషి మరణానంతరం మట్టి లో కలిసి పోయే నేత్రాలు దానం చేయడం ద్వారా అంధత్వం తో బాధ పడుతున్న ఇద్దరు అంధులకు చూపు ఇచ్చి మరణించిన తరువాత కూడా ఈ ప్రపంచాన్ని చూసే బృహత్కార్యం నేత్రదానం ఒక్కటే కావున ప్రతిఒక్కరు నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

## రైతు కష్టాన్ని వృథా పోనివ్వం

- దగ్ధమైన అరటి తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన బీటెక్ రవి



**పులివెందుల- సూర్య వాస్తవం :** పులివెందుల మండల పరిధిలోని మోటున్నతలపల్లె గ్రామంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన అరటి తోటలను పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి, వేంపల్లె టీడీపీ ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన దగ్ధమైన పంటను, కాలిపోయిన వ్యవసాయ పరికరాలను స్వయంగా చూసి చలించిపోయారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ చేతికి అందే దశలో ఉన్న అరటి పంట అగ్నికి ఆహుతి కావడం అత్యంత బాధాకరమన్నారు. కేవలం పంట మాత్రమే కాకుండా, లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసుకున్న డ్రిప్ పరికరాలు, బోర్ మోటర్లు పూర్తిగా కాలిపోవడంతో రైతు కోలుకోలేని దెబ్బ తిన్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కష్టాన్ని వృథా పోనివ్వమని ఆయన హామీ ఇచ్చారు. అగ్నిప్రమాద నష్టాన్ని తక్షణమే అంచనా వేయాలని సంబంధిత ఉద్యానవన, రెవెన్యూ శాఖ అధికారులను కోరారు. బాధిత రైతులకు ప్రభుత్వం తరపున పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందేలా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి మరియు సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షపాతి అని, ఆపదలో ఉన్న ప్రతి రైతును ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, పులివెందుల మండల సింగిల్ విండో అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, పుష్పనాథ రెడ్డి, పుష్పగిరి స్కూల్ కరస్పాండెంట్ ఓబుల్ రెడ్డి, గంగాధర్ యాదవ్, ప్రసాద్ యాదవ్, జయకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

- పిల్లలు అల్లరి చేస్తే దండించడం ఇలానేనా
- తల్లిదండ్రుల ఆవేదన



**వేంపల్లె - సూర్య వాస్తవం :** వేముల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న కార్తీక్ అనే విద్యార్థిని బుధవారం అల్లరి చేస్తున్నాడని ఉపాధ్యాయుడుడ్రిప్పు పైపుతో పశువును బాదినట్లు బాధడంతో విద్యార్థి వీపు చిట్లు పోయింది. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వచ్చి మా పిల్లవాడిని పశువును కొట్టినట్టు ఎందుకు కొట్టారని ప్రధానోపాధ్యాయిని ప్రశ్నించారు. ఏదైనా తప్పు చేస్తే చేత్తో కానీ చిన్న బెత్తంతో కొడతారే తప్ప డ్రిప్పు పైపుతో కొట్టాల్సినంత తప్పు మా పిల్లవాడు ఏం చేశారని ఆయనను ప్రశ్నించారు. ఇంత ఆయన నా ఉపాధ్యాయుడే అల్లరి చేస్తూ ఉంటే కొట్టారని అయితే ఇంతగా కొట్టకూడదని సమాధానం ఇచ్చారు. మరి ఈ ఉపాధ్యాయునిపై ఉన్నతాధికారులు ఏమి చర్యలు తీసుకుంటారో వేసి చూడాల్సిందే.

## వసంత పంచమి పూజా కార్యక్రమాలకు తరలిరండి



**పులివెందుల- సూర్య వాస్తవం :** ఈనెల 23వ తేదీ సాయంత్రం 4 సమయంలో వసంత పంచమి సందర్భంగా పులి వెందులోని అలవలపాడు రోడ్డులో గల వాసవి కళ్యాణ మండపంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో సరస్వతి పూజ కార్యక్రమం కలదు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాధా మనోహర్ దాస్ వస్తున్నారు. కావున పిల్లలు తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మనవి సాయంత్రం నాలుగు గంటలకు పాత బస్టాండ్ దగ్గర నుంచి వాసవి కళ్యాణ మండపం వరకు బైక్ ర్యాలీ కూడా కలదు కార్యక్రమం అనంతరం అల్పాహారం ఉంటుందని తెలిపారు.

## వ్యవసాయ రంగంలో కొత్త పద్ధతులపై అధికారులు అవగాహన కల్పించాలి

- ప్రజలతో మమేకమైన ఎంపీ అవినాష్ రెడ్డి





**పులివెందుల- సూర్య వాస్తవం :** వ్యవసాయ రంగంలో కొత్త పద్ధతులు ప్రవేశపెడుతున్నప్పుడు రైతులకు పూర్తి అవగాహన కల్పించడం, నాణ్యమైన మె ొక్కలు అందించడం ప్రధా నమని జిల్లా ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పులివెందుల పర్యటనలో భాగంగా లింగాల మండలంలో అరటి పంట దిగుబడి సరిగా రాక తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్న రైతుల విజ్ఞప్తి మేరకు ఎంపీ అవినాష్ రెడ్డి టిష్యూ కల్చర్ అరటి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు టిష్యూ కల్చర్ అరటి మొక్కల నాణ్యత పై దిగుబడిలో తేడాలు వస్తున్న తీరును ఎంపీకి వివరించగా సంబంధిత టిష్యూ కల్చర్ కంపెనీ ప్రతినిధులతో ఎంపీ ఫోన్ ద్వారా మాట్లాడి రైతులకు జరిగిన నష్టం పై స్పష్టమైన వివరణ ఇవ్వాలని భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అవసరమైతే రైతులకు పరిహారం చెల్లించే అంశాన్ని కూడా పరిశీలించాలని కంపెనీ ప్రతినిధులకు తెలియజేస్తూ, రైతులు నష్టపోయే పరిస్థితి వస్తే వైఎస?ర్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు రైతులకు అండగా నిలుస్తుందని తెలియజేశారు. అంతకు మునుపు పులివెందులలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలు మరియు నాయకులతో మమేకమై వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఈ కార్యక్రమాలలో గండి ఆంజనేయ స్వామి పాలకమండలి సభ్యులు తేజ, పబ్బతి సాగర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య




**వేంపల్లె - సూర్య వాస్తవం :** తాళ్లపల్లి, వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పులివెందుల మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య బుధవారం ల్యాబ్ రేటరీలను సందర్శించి రికార్డులు పరిశీలించి ల్యాబ్ టెక్నీషియన్ లు హరిప్రసాద్, జబీవుల్లా ను మలేరియా, డెంగ్యూ కేసులు వివరాలు అడిగి తెలుసుకోవడమైనది. ఈ కార్యక్రమములో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లడుతూ ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్తపుతల సేకరించి వారానికి రెండు సార్లు ప్రతి బుధవారం, ప్రతి శనివారం ల్యాబ్ కు అందజేయాలి అని ఎవ్వరికైనా మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికత్స అందించి మలేరియా వచ్చిన వ్యక్తి గ్రామములో ఫీవర్ సర్వే, లార్వా సర్వే చేసి గ్రామములోని ప్రజలందరికీ రక్తపరీక్షలు చేయడం జరుగుతుంది అని సిద్దయ్య అన్నారు.

## ఎస్సీ వర్గాల సంక్షేమానికి శ్రీపతి బాబు కృషి చేయాలి

- టీడీపీ శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి



**పులివెందుల- సూర్య వాస్తవం :** రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీపతి బాబుకి తెలుగుదేశం పార్టీ శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. విజయవాడలోని ఎన్టీఆర్ భవన్‌లో ఉన్న ఎస్సి కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ మెంబర్‌గా బాధ్యతలు స్వీకరించిన డా. శ్రీపతి బాబుకి శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి శ్రీపతి బాబు నేతృత్వంలో ఎస్సి వర్గాల సంక్షేమం, సామాజిక న్యాయం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా జీడీపీ పెంచేందుకు చర్యలు తీసుకుంటాం

- నిబంధనల ప్రకారం పిజిఆర్ఎస్ తదితర మార్గాల ద్వారా వచ్చిన గ్రీవెన్స్‌ని, రెవెన్యూ సమస్యలన్నీ పరిష్కారం చేస్తాం
- నూతన జిల్లా సంయుక్త కలెక్టర్, ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ సి.విష్ణు చరణ్..



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా సంయుక్త కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా నూతన సంయుక్త కలెక్టర్ గా సి.విష్ణు చరణ్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఇంచార్జి జిల్లా కలెక్టర్ గా కూడా బాధ్యతలను స్వీకరించారు. బుధవారం జిల్లా సంయుక్త కలెక్టర్ ఛాంబర్ లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా సంయుక్త కలెక్టర్, ఇంఛార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ నుంచి నూతన సంయుక్త కలెక్టర్ గా, ఇంచార్జి జిల్లా కలెక్టర్ గా సి.విష్ణు చరణ్ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా మీడియాతో నూతన జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ తాను 2019 బ్యాచ్ ఐఏఎస్ ఆఫీసర్ అని, తాజాగా జరిగిన బదిలీలలో భాగంగా అనంతపురం జిల్లాకి జాయింట్ కలెక్టర్?గా నియమించడం జరిగిందన్నారు. దీనికంటే ముందు తాను చిత్తూరు జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్ గా పనిచేశానని, తరువాత వెస్ట్ గోదావరి జిల్లాలో నర్సాపురం సబ్ డివిజన్?కి సబ్ కలెక్టర్‌గా, ఐటిడిఏ పార్వతీపురం ప్రాజెక్ట్ అధికారిగా పని చేశానన్నారు. అనంతరం నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేశానని, తదనంతరం సోషల్ వెల్ఫేర్ శాఖ డిప్యూటీ సెక్రటరీ కూడా పని చేశానని తెలిపారు. అనంతపురం జిల్లాకి జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నాన న్నారు. ప్రతి మూడు నెలలకి ఒకసారి గౌరవ రాష్ట్ర ముఖ్య మంత్రి కలెక్టర్స్ కాన్ఫరెన్స్ పెడుతున్నారని, ప్రతి జిల్లా అభివృద్ధికి కావలసిన అంశాలపై, ఉన్నాయనీ, పురోగతిపై వివరించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా జీడిపి పెంచడం అన్నది ప్రతి జిల్లాకి సీయం గారు చాలా ప్రత్యేకంగా తీసుకున్న ఒక అంశం అన్నారు. ఏ విధంగా అయితే మన జిల్లాకి జీడిపి పెంచగలమో దాని ప్రకారం అన్ని సెక్టర్స్ లో కూడా.. ప్రైమరీ, సెకండరీ, అన్ని సెక్టర్స్ లో కూడా ఏ విధంగా అయితే మనం పెంచగలమో అవన్నీ కూడా ప్రయత్నిస్తామన్నారు. రెవెన్యూ సమస్యలు అన్నవి ఎప్పుడూ వస్తూనే ఉంటాయని, ఏదైతే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారో అవన్నీ కూడా త్వరితగతిన పిజిఆర్ఎస్‌లో వచ్చిన గ్రీవెన్స్ కానీ, రెగ్యులర్?గా వస్తున్న గ్రీవెన్స్ కానీ ఏవైనా సరే నిబంధనల ప్రకారం అన్ని కూడా పరిష్కారం చేస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి పిజిఆర్ఎస్‌లో, రాష్ట్ర స్థాయిలో ఒక 70 నుంచి 80 శాతం గ్రీవెన్స్ అన్నీ కూడా రెవెన్యూ పైన వస్తున్నాయని చెప్పడం జరిగిందని, మన జిల్లాలో పరిస్థితి ఏంటనేది ఒకసారి సమీక్ష చేయాలన్నారు. రెవెన్యూ సమస్యలన్నీ పూర్తిగా పరిష్కారం చేయగలమో అప్పుడే చాలా వరకు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తారని, దాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి గ్రీవెన్స్?ని కూడా చాలా జాగ్రత్తగా నిబంధనల ప్రకారం పరిష్కారం చేస్తామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ డ్యూటీ చార్ట్ ఉంటుంది, ప్రతి ఒక్కరు చేయవలసిన పనులు ఉంటాయని, ఎవరి పనులు వాళ్ళు సక్రమంగా చేస్తూ ఉంటే సమస్యలు అన్ని పరిష్కారం అవుతాయన్నారు. ప్రతి ఒక్కరిని మోటివేట్ చేస్తూ, స్ఫూర్తిని ఇస్తూ వాళ్ళకి ఏదైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కారం చేస్తామన్నారు. అంతకుముందు కలెక్టరేట్ కు చేరుకున్న నూతన సంయుక్త కలెక్టర్ సి.విష్ణు చరణ్ గారికి డిఆర? ఎ.మలోల, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు యోగేశ్వరి దేవి, రియాజుద్దీన్, వసంతలత, ఎండోమెంట్ ఏసీ మల్లికార్జున ప్రసాద్, తదితరులు పూలమొక్కలు అందించి మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు.ఈ కార్య క్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, ఆర్డీఓ కేశవ నాయుడు, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామ కృష్ణరెడ్డి, ఎస్డీసి ఆనంద్, సిపిఓ అశోక్ కుమార్, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ గంగాధర్ రెడ్డి, డిఎస? వెంకటే శ్వర్లు, తహసీల్దార్లు హరికుమార్, మోహన్ కుమార్, నాగరాజు, ల్యాండ్ రిఫామ్స్ స్పెషల్ తహసీల్దార్ వేణు గోపాల్, కలెక్టరేట్ అధికారులు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





# వాయల్పాడు, పీలేరు పోలీస్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ






**నాయుడుపేట - సూర్య వాస్తవం :**

అన్నమయ్య జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) ధీరజ్ కునుబిల్లి బుధవారం రాయచోటి సబ్ డివిజన్ పరిధిలోని వాయ ల్పాడు, పీలేరు పోలీస్ స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్లలోని రికార్డులను, లాకప్ రూమ్‌ను, పరిసరాలను నిశితంగా పరిశీలించారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ పర్యటనలో ఎస్పీపోలీసు అధికారులకు, సిబ్బందికి ముఖ్య సూచనలు చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలి. బాధితులకు భరోసా కల్పించి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో గస్తీ పెంచాలి. పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలి. పెండింగ్‌లో ఉన్న కేసులను శాస్త్రీయ పద్ధతుల్లో దర్యాప్తు చేసి, త్వరితగతిన ఛార్జ్ షీట్లు దాఖలు చేయాలి. మహిళలు, పిల్లల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి.

ప్రతి పోలీస్ అధికారి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, తద్వారా నేరాల ఛేదనలో వేగం పెరుగుతుందని సూచించారు. సిబ్బంది సంక్షేమ పై దృష్టి సారించాలని, ఆయా పోలీస్ స్టేషన్ అధికారులకు సూచించారు.ప్రజలకు ఎస్పీ సందేశం. గుర్తుతెలియని వ్యక్తులకు ఓటిపి లు చెప్పవద్దని, ఏదైనా మోసం జరిగితే వెంటనే 1930 కి ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని, అసాంఘిక కార్యకలా పాలకు దూరంగా ఉండాలని కోరారు. గ్రామాలలోని కొత్త వ్యక్తుల గురించి లేదా అనుమానాస్పద కదలికల గురించి స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయచోటి డిఎస్పీ యం.ఆర్. కృష్ణమోహన్ పీలేరు సర్కిల్ ఇన్స్పెక్టర్ యుగంధర్ , ఎస్ఐలు యం.లోకేష్, ఎస్ రహీం, వాయల్పాడు ఎస్ఐ సి.తిప్పేస్వామి ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మలేరియా, డెంగ్యూ నియంత్రణకు చర్యలు

### - సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య



**వేంపల్లె - సూర్య వాస్తవం :** మండలంలోని తాళ్లపల్లి, వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పులివెందుల మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య బుధవారం ల్యాబ్ రేటరీలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ల్యాబ్ టెక్నీషియన్‌లు హరిప్రసాద్, జబీవుల్లాను మలేరియా, డెంగ్యూ కేసులు వివరాలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లడుతూ ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్తపుతలు సేకరించి వారానికి రెండు సార్లు ప్రతి బుధవారం, ప్రతి శనివారం ల్యాబ్ కు అందజేయాలని తెలిపారు. ఎవరికైన మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికత్స అందించి మలేరియా వచ్చిన వ్యక్తి గ్రామములో ఫీవర్ సర్వే, లార్వా సర్వే చేసి గ్రామములోని ప్రజలందరికీ రక్తపరీక్షలు చేయడం జరుగుతుందని సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు.

# రాచవీటి తేజేంద్రను సన్మానిస్తున్న జనసేన పార్టీ పులివెందుల ఇన్‌ఛార్జి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** సౌత్ ఏసియన్ గోల్ఫ్ షాట్ బాల్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొని గోల్ఫ్ కీపర్‌గా అత్యంత ప్రతిభ కనపర్చి భారత దేశానికి స్వర్ణ పథకం తీసుకొచ్చిన రాచవీటి తెజేంద్రని ఘనంగా సన్మానించిన జనసేన పార్టీ పులివెందుల నియోజకవర్గ సమన్వయకర్త డా. హరీష్. జనసేన పార్టీ ఎప్పుడు క్రీడాకారులకు మద్దతుగా వుటుందని, గతంలో కూడా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మహిళా అందుల క్రికెట్ విజేతలకు భారీ పారితోషకం ప్రకటించడం జరిగిందని గుర్తు చేసారు. పులివెందుల నియోజకవర్గం నుంచి అత్యుత్తమ ప్రతిభ కనపర్చి బంగారు పథకం సాధించడంలో తేజేంద్ర కీలక పాత్ర వహించాడని కొనియాడారు. భావి తరాల క్రీడాకారులకు సహాయపడాలని, వారికీ మార్గదర్శిగా ఉండి పులివెందుల నియోజకవర్గంలోని ప్రతి క్రీడాకారునికి అండగా నిలబడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శ్యామ్, దేవా, మనోజ్, భార్గవ్ రెడ్డి, ఐక్య కాపునాడు అధ్యక్షులు ఇడుపులపాయ జయచంద్ర, జన సైనికులు పాల్గొన్నారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

### - రెండవ పట్టణ సీఐ శ్రీకాంత్
### - గంజాయి దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం:** అనంతపురం పట్టణంలోని స్థానిక అరవింద్ నగర్‌లో ఉన్న ఎస్‌కేడీ హైస్కూల్‌లో బుధవారం నాడు మాదక ద్రవ్యాలపై, ముఖ్యంగా గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై రెండవ పట్టణ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెండవ పట్టణ సి.ఐ శ్రీకాంత్ పాల్గొని పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అవి ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా భవిష్యత్తును కూడా నాశనం చేస్తాయని వివరించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం వల్ల శారీరక, మానసిక సమస్యలతో పాటు చట్టపరమైన ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, చదువుపై దృష్టి సారించి మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. మాదక ద్రవ్యాల అక్రమ వినియోగం లేదా రవాణాపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏపీలో భూముల మార్కెట్ విలువ పెంపు..

### - ఫిబ్రవరి 1 నుంచి అమలు...!!



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** ఏపీలో భూముల మార్కెట్ విలువను ప్రభుత్వం మరోసారి పెంచింది. ఈ సవరించిన విలువలు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్ ఈ మేరకు మెమో జారీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది రెండోసారి భూముల మార్కెట్ విలువల పెంపు. ఈ పెంపుతో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగం ద్వారా ప్రభుత్వ ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.13,150 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నిర్ణయం రియల్ ఎస్టేట్ రంగంపై ప్రభావం చూపనుంది, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయి.

# క్యాట్ ఒలంపియాడ్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం



**గుంతకల్- సూర్య వాస్తవం :** స్థానిక గుంతకల్ పట్టణంలో గల శ్రీ చైతన్య విద్యార్థులు అత్యధికంగా క్యాష్ ప్రైజ్, గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్లు గెలుచు కున్నారని శ్రీ చైతన్య విద్యాసంస్థల అనంతపురం జోన్ ఏజీఎం శ్రీ సుబ్బారెడ్డి తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా గణితం, భౌతిక, రసాయన శాస్త్రాలలో నిర్వహించిన క్యాట్ ఒలంపియాడ్ రెండవ లెవెల్ ఫలితాలలో రూ.2వేలు క్యాష్ ప్రైజ్ ను ఇద్దరు అలాగే రూ.1000 రూపాయలు క్యాష్ ప్రైజ్‌ను 26 మంది విద్యార్థులు గెలుపొందారు. అంతేకాకుండా ఈ ఎగ్జామ్‌లో గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్ గెలుచుకొని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచారని తెలియ జేశారు. అత్యంత అనుభవం కలిగిన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు కటోర సాధన చేయడం వల్ల అద్భుతమైన ఫలితాలను శ్రీ చైతన్య స్కూల్స్ సాధించగలుగుతున్నారని అన్నారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులను ఏజీఎం సుబ్బారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఘన విజయానికి కారుకులైన ఉపాధ్యాయులను అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘనవిజయాలను సాధించడం ఒక్క శ్రీ చైతన్య విద్యాసంస్థలకే సాధ్యమవుతుందని పునరుద్ఘాటించారు. ఈ అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపల్స్, కోఆర్డినేటర్, డీన్లు, ఇన్‌ఛార్జిలు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, విద్యార్థులు అందరూ పాల్గొని విజయవంతం చేశారు.

# ‘నారీ నారీ నడుమ మురారి’..
# బాక్సాఫీస్ లెక్క ఎంతవరకు వెళ్లిందంటే



యంగ్ హీరో శర్వానంద్ సంక్రాంతి రేసులో తనదైన ముద్ర వేస్తున్నారు. లిమిటెడ్ థియేటర్లలో విడుదలైనప్పటికీ, ‘నారీ నారీ నడుమ మురారి’ బాక్సాఫీస్ వద్ద ఎక్సలెంట్ కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఫ్యామిలీ ఆడియన్స్‌ను మెప్పించడంలో సక్సెస్ అయిన ఈ చిత్రం, ఇప్పటికే బ్రేక్ ఈవెన్ మార్కును దాటేసి లాభాల్లోకి వచ్చేసింది. శర్వానంద్ కెరీర్‌లో మరో డీసెంట్ హిట్ చేరిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. సంక్రాంతి పండుగ సెలవులు ముగియడంతో వర్కింగ్ డేస్?లో సినిమా వసూళ్లు సహజంగానే కొంత తగ్గాయి. ఐదో రోజు ఒక కోటి రూపాయల షేర్ సాధించిన ఈ చిత్రం, ఆరో రోజుకి వచ్చేసరికి కొంచెం డ్రాప్స్ చూపెట్టింది. ఆరో రోజు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 60 లక్షల షేర్ రాగా, ప్రపంచవ్యాప్తంగా 90 లక్షల రేంజ్ లో షేర్ సాధించి తన పట్టును నిలబెట్టుకుంది.

పెద్ద సినిమాల మధ్య ఈ స్థాయి హోల్డ్ చూపించడం మంచి విషయమే.వసూళ్ల వివరాల్లోకి వెళ్తే.. ఆరు రోజులు పూర్తి చేసుకునే సరికి ‘నారీ నారీ నడుమ మురారి’ ప్రపంచవ్యాప్తంగా సుమారు 22.40 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. తెలుగు రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణలో కలిపి 8.69 కోట్ల షేర్ వసూలైంది. ఇందులో నైజాం ఏరియా నుంచి 3.31 కోట్లు, ఆంధ్రా నుంచి 4.60 కోట్ల షేర్ రావడం గమనార్హం. మాస్ సినిమాల హడావిడి ఉన్నా, శర్వా మార్క్ ఫ్యామిలీ డ్రామాకు ఆడియన్స్ బ్రహ్మరథం పడుతున్నారు. ఈ సినిమా బాక్సాఫీస్ బిజినెస్, ప్రాఫిట్స్ విషయానికి వస్తే, 10.25 కోట్ల బ్రేక్ ఈవెన్ టార్గెట్‌తో బరిలోకి దిగింది. ఆరు రోజుల్లోనే 12.19 కోట్ల వరల్డ్ వైడ్ షేర్ సాధించి, ఇప్పటికే 1.94 కోట్ల లాభాలను క్లియర్ చేసింది. దీంతో ఈ సినిమా క్లీన్ హిట్ స్టేటస్ నుండి ఇప్పుడు సూపర్ హిట్ దిశగా అడుగులు వేస్తోంది. బయ్యర్లు అందరూ ఇప్పటికే సేఫ్ జోన్‌లోకి వెళ్ళిపోవడంతో మేకర్స్ ఫుల్ ఖుషీగా ఉన్నారు. ముఖ్యంగా ఓవర్సీస్?లో కూడా ఈ సినిమాకు మంచి ఆదరణ లభిస్తోంది. అక్కడ సుమారు 2.80 కోట్ల షేర్ వసూలైంది. కర్ణాటక ఇతర రాష్ట్రాల్లో కలిపి 70 లక్షల వరకు షేర్ రాబట్టింది. ఫ్యామిలీ ఎంటర్టైనర్ కావడం, అందులోనూ శర్వానంద్ పర్ఫార్మెన్స్ బాగుండటంతో మల్టీప్లెక్స్ ఆడియన్స్ ఈ సినిమాను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. వర్కింగ్ డేస్‌లో డ్రాప్స్ ఉన్నా, సెకండ్ వీకెండ్‌లో మళ్ళీ పుంజుకునే అవకాశం కనిపిస్తోంది. మొత్తానికి శర్వానంద్ తన సక్సెస్ ట్రాక్‌ను కంటిన్యూ చేస్తున్నారు. సంక్రాంతి విన్నర్లలో ఒకరిగా నిలిచి, బాక్సాఫీస్ వద్ద తన స్టామినా ఏంటో మరోసారి నిరూపించారు. మిగిలిన రన్‌లో ఈ సినిమా ఇంకెంత వరకు ప్రాఫిట్స్ పెంచుకుంటుందో చూడాలి. ఇప్పటికే ‘బైకర్’ లాంటి క్రేజీ ప్రాజెక్టులు చేతిలో ఉన్న శర్వాకు, ఈ హిట్ మంచి బూస్టప్ ఇచ్చిందని చెప్పొచ్చు.

## వారితో నిర్మించేందుకు
# ముందుకు రాయ్

గతేడాది విడుదలైన ‘కొత్తలోక : చాప్టర్1’ చిత్రం చిన్న సినిమాగా విడుదలై హిట్ సినిమాగా నిలిచింది. దీనిపై తాజాగా మాళవిక మోహనన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇలాంటి సినిమాలను హీరోలతో చేయడానికి మాత్రమే నిర్మాతలు ఆసక్తి ప్రదర్శిస్తారని అన్నారు. ‘మహిళా ప్రాధాన్యమున్న చిత్రాలకు కలెక్షన్లు రావని చాలా మంది నిర్మాతలు భావిస్తారు. అందుకే హీరోయిన్‌లు లీడ్‌రోల్ చేసే వాటిని అధిక బడ్జెట్‌తో తీసేందుకు ముందుకు రాయ్. మహిళా ప్రాధాన్యత ఉన్న చిత్రాలకు పెట్టుబడి పెట్టేందుకు ఎవరూ ఆసక్తి చూపరు. అందుకే అవి తక్కువగా వస్తుంటాయి. వీటికి ‘కొత్తలోక’ సమాధానం చెప్పింది. యువ నటి ప్రధానపాత్రలో చేసిన ఆ చిత్రం రికార్డులు సృష్టించింది. కల్యాణి ప్రియదర్శన్ ఆ పాత్రకు న్యాయం చేస్తుందని దర్శకనిర్మాతలు నమ్మారు కాబట్టే ఆ చిత్రం అంతటి విజయాన్ని సొంతం చేసుకుంది’ అని మాళవిక అన్నారు.





# అదరగొట్టిన అభిషేక్, రింకు

- తొలి టి20లో న్యూజిలాండ్ చిత్తు
- 48పరుగుల తేడాతో టీమిండియా గెలుపు



**నాగ్‌పూర్:** న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టి20లో టీమిండియా 48 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత ఓపెనర్ అభిషేక్ శర్మ ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగగా.. చివర్లో రింకు సింగ్ 20బంతుల్లోనే 44 పరుగులు చేయడంతో భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 238పరుగుల భారీస్కోర్ చేసింది. అనంతరం న్యూజిలాండ్ జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 7వికెట్లు కోల్పోయి 190పరుగులే చేయగల్గింది. ఛేదనలో భాగంగా కివీస్ జట్టులో గ్లెన్ ఫిలిప్స్(78; 40బంతుల్లో 4ఫోర్లు, 6సిక్సర్లు) పోరాటానికి తోడు ఛాప్మన్(39), మిఛెల్(28), రాబిన్సన్(21) బ్యాటింగ్‌లో రాణించారు. భారతజట్టు బౌలర్లలో వరుణ్ చక్రవర్తి, దూబేకు రెండేసి, అర్ష్‌దీప్, హార్దిక్, అక్షర్ పటేల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

తొలుత టి20 సంచలనం అభిషేక్ శర్మ కేవలం 35బంతుల్లోనే 5ఫోర్లు, 8సిక్సర్లతో 84పరుగులు చేశాడు. ఈ క్రమంలో 22బంతుల్లోనే అర్ధసెంచరీ చేశాడు. చివర్లో రింకూ సింగ్(44నాటౌట్; 20బంతుల్లో 4ఫోర్లు, 3సిక్సర్లు తన మార్క్ స్ట్రోక్ ప్లేతో రెచ్చిపోయాడు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 238పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు తన మొదటి ఓవర్లోనే జేమీషన్ షాకిచ్చాడు. ఓపెనర్ సంజూ శాంసన్(10) వికెట్ కోసం ఫీల్డర్‌ను మిడ్‌వికెట్‌కు మార్చి ఫలితం రాబట్టాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్(8) మొదటి బంతినే ఫోర్?గా మలిచాడు. అయితే.. డప్ఫీ ఓవర్లో మిడ్‌వికెట్లో ఆడబోయిన అతడు అక్కడే కాచుకొని ఉన్న చాప్?మన్? చేతికి చిక్కాడు. దాంతో.. 27పరుగుల వద్ద టీమిండియా 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్రమంలో 4వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (32) ఎదుర్కొన్న మొదటి బంతికే ఫోర్ కొట్టాడు. అనంతరం జేమీసన్ ఓవర్లో అభిషేక్ శర్మ(84) స్ట్రెయిట్‌గా భారీ సిక్సర్ సంధించాడు. వీరిద్దరి జోరుతో పవర్? ప్లేలో 68 పరుగులు చేసింది. దీంతో ఐదు టి20ల సిరీస్?లో భారతజట్టు 1-0 ఆధిక్యతలో నిలువగా.. రెండో టి20 రారుపూర్ వేదికగా శుక్రవారం జరగనుంది.

**స్కోర్‌బోర్డు:**

ఇండియా ఇన్నింగ్స్: సంజు శాంసన్ (సి)రచిన్ రవీంద్ర (బి)జేమీసన్ 10, అభిషేక్ శర్మ (సి)జేమీసన్ (బి)ఇష్ సోధీ 84, ఇషాన్ కిషన్ (సి)ఛాప్మన్ (బి)డఫీ 8, సూర్యకుమార్ యాదవ్ (సి)రాబిన్సన్ (బి)సాంట్నర్ 32, హార్దిక్ పాండ్యా (సి)చాప్మన్ (బి)డఫీ 25, దూబె (సి అండ్ బి)జేమీసన్ 9, రింకు సింగ్ (నాటౌట్?) 44, అక్షర్ పటేల్ (సి)మిఛెల్ (బి)క్రిస్టియన్ క్లార్క్ 5, అర్ష్‌దీప్ (నాటౌట్) 6, అదనం 15. (20ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 238పరుగులు. వికెట్ల పతనం: 1/18, 2/27, 3/126, 4/149, 5/166, 6/185, 7/209 బౌలింగ్?: డఫీ 4-0-27-2, జేమీసన్ 4-0-54-2, క్రిస్టియన్ క్లార్క్ 4-0-40-1, ఇష్ సోధీ 3-0-38-1, ఫిలిప్స్ 1-0-20-0, సాంట్నర్ 3-0-37-1, మిఛెల్ 1-0-21-0

**న్యూజిలాండ్ ఇన్నింగ్స్:** కాన్వే (సి)సంజు (బి)అర్ష్‌దీప్? 0, రాబిన్సన్ (సి)దూబే (బి)వరుణ్‌చక్రవర్తి 21, రచిన్ రవీంద్ర (సి)అభిషేక్ (బి)హార్దిక్ 1, ఫిలిప్స్ (సి)దూబే (బి)అక్షర్ 78, చాప్మన్ (సి)అభిషేక్ (బి)వరుణ్ చక్రవర్తి 39, మిఛెల్ (సి)బిష్ణోరు (బి)దూబే 28, సాంట్నర్ (నాటౌట్?) 20, క్రిస్టియన్ క్లార్క్ (సి)రింకు సింగ్ (బి)దూబే 0, జేమీసన్ (నాటౌట్) 1, అదనం 2. (20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 190పరుగులు.

**వికెట్ల పతనం:** 1/0, 2/1, 3/52, 4/131, 5/143, 6/189, 7/189 బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-31-1, హార్దిక్ పాండ్యా 2-0-20-1, బుమ్రా 3-0-29-0, అక్షర్ పటేల్ 3.3-0-42-1, వరుణ్ చక్రవర్తి 4-0-37-2, దూబె 3-0-28-2, అభిషేక్ శర్మ 0.3-0-3-0.

# బడుగు వర్గాల హాస్టల్‌పై దందా..!

- అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం
- నాసిరకంగా ఎస్సీ హాస్టల్ మూడు అంతస్తుల నిర్మాణం
- అధికారుల అండతో కాంట్రాక్టర్ దోపిడీ ఆరోపణలు
- కోట్ల ప్రజాధనం నీళ్లపాలవుతున్నదా ?
- రాజకీయ పలుకుబడితో కాంట్రాక్టర్‌పై చర్యలేమి...?
- గత భవనాలే సాక్ష్యం.. మళ్లీ అదే నిర్లక్ష్యం





**కనేకల్ - సూర్య వాస్తవం :**
కనేకల్ మండల కేంద్రంలో, కనేకల్–రాయదుర్గం ప్రధాన రహదారి పక్కన నిర్మిస్తున్న మూడు అంతస్తుల ఎస్సీ హాస్టల్ నూతన భవన నిర్మాణ పనులు తీవ్ర నాసిరకంగా జరుగుతున్నాయన్న ఆరోపణలు స్థానికుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. కోట్ల రూపాయల ప్రజాధనం వెచ్చించి చేపడుతున్న ఈ నిర్మాణంలో నాణ్యత పూర్తిగా లోపించిందని, సంబంధిత అధికారులు మాత్రం పర్యవేక్షణ లేకుండా మౌనంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. హాస్టల్ నిర్మాణానికి వినియోగిస్తున్న సిమెంట్ ఇటుకలు చేత్తో పట్టుకుంటేనే పగిలిపోతుండటంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతలేని సిమెంట్ వినియోగం, చిప్స్ నిష్పత్తిలో లోపం, సరైన క్యూరింగ్ చేయకపోవడం వల్ల ఇటుకలు పూర్తిగా బలహీనంగా తయారవుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిర్మాణం కొనసాగితే, భవనం కొద్ది రోజుల్లోనే కూలిపోయే ప్రమాదం ఉందని ప్రజలు భయపడుతున్నారు. గతంలో కోట్ల రూపాయలతో నిర్మించిన హెచ్ఎల్సీ భవనం కూడా ఏడాది లోపే శిథిలావస్థకు చేరిందని స్థానికులు గుర్తు చేస్తున్నారు. ఆ భవనంలో ఇప్పటివరకు ఒక్కరోజు కూడా అధికారులు కార్యాలయం నిర్వహించకపోవడం గమనార్హం. ప్రస్తుతం అది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఇటీవల నిర్మించిన 'వెలుగు' భవనం కూడా గోడలు పగిలి కూలే స్థితిలో ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని ప్రజలు పేర్కొంటున్నారు. ఇన్ని ఉదాహరణలు కళ్లముందే ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. రాజకీయ పలుకుబడి ఉన్న కాంట్రాక్టర్లకు అధికారులు భయపడి నిర్మాణ ప్రదేశానికి రావడానికీ, ప్రశ్నించడానికీ వెనుకాడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పర్సంటేజీలకు లొంగి ప్రజా సంక్షేమ పనులను నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కోట్ల రూపాయలు వెచ్చిస్తూ పథకాలు అమలు చేస్తుంటే, కొందరు కాంట్రాక్టర్లు డబ్బే లక్ష్యంగా నాసిరక నిర్మాణాలు చేపట్టి ప్రభుత్వ ప్రతిష్ఠకు మచ్చ తెస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ప్రధాన రహదారి పక్కన నిర్మిస్తున్న ఎస్సీ హాస్టల్ భవనాన్ని తక్షణమే పరిశీలించి, నాణ్యమైన నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కనేకల్ మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## అంకాలమ్మ, కుంటెమ్మ జాతరలో బండలాగుడు పోటీకి రూ.50వేల బహుమతి

- అందజేసిన గుమ్మనూరు ఈశ్వర్





**పామిడి - సూర్యవాస్తవం :** పామిడి కొండూరు రోడ్డులో వెలసిన శ్రీ అంకాలమ్మ, కుంటెమ్మ జాతర సందర్భంగా ఆలయ కమిటీ వారి ప్రత్యేక ఆహ్వానం మేరకు జాతరకు హాజరై అమ్మవారి ప్రత్యేక పూజ కార్యక్రమం లో పాల్గొన్న గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు పామిడి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ పామిడి పట్టణం నందు పాత సాంప్రదాయాలను పాటిస్తూ రాతి దూలం లాగుడు పోటీలను నిర్వహించడం చాలా సంతోషం ఈ కార్యక్రమం లో నేను పాల్గొన్నందుకు నాకు చాలా సంతోషం గా ఉందని తెలిపారు అనంతరం గుమ్మనూరు ఈశ్వర్ జాతర సందర్భంగా నిర్వహించిన రాతి దూలం లాగుడు పోటీలలో పాల్గొని రాతి దూలం ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు రాతి దూలం లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి గా ఇవ్వాలని నిర్వాహకులకు రూ.50వేలు అందించారు. ఈ కార్యక్రమం లో పామిడి పట్టణ మరియు9 మండల కూటమి నాయకులు మరియు కార్యకర్తలు, పామిడి చుట్టుపక్కల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కవర్‌లో ఆడ శిశువు మృతదేహం

- ఘటనపై పోలీసుల దర్యాప్తు



**కనేకల్- సూర్య వాస్తవం:** గుత్తి పట్టణంలో గుర్తు తెలియని ఒకరోజు వయస్సు గల ఆడ శిశువు మృతదేహం కలకలం రేపింది. సోమవారం–మంగళవారం మధ్య రాత్రి (20.01.2026/21.01.2026) సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఏవో కారణాల వల్ల పుట్టిన శిశు వును బ్రతికి ఉన్నప్పుడు గానీ లేదా మృత దేహంగానీ గుత్తి టౌన్ శివాలయం వీధిలోని వక్కలకుంట వద్ద మై నుద్దీన్‌కు చెందిన ఇంటి అరుగుపై ప్లాస్టిక్ కవర్‌లో చుట్టి వదిలివెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనపై గుత్తి టౌన్ నేసేవీధి--01 ఏరియా విఆర్ఓ ఫిర్యాదు మేరకు గుత్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలనతో పాటు, స్థానికుల నుంచి సమాచారం సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఏవైనా ఆచూకీ వివరాలు తెలిసిన వారు గుత్తి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. సమాచారం ఇవ్వదలచిన వారు సీఐ :9346010582, ఎస్ఐ: 9346917082, ఎస్ఐ: 95505 25101 నంబర్లకు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. కేసు విచారణ కొనసాగుతోందని, దోషుల గుర్తింపు కోసం అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.



## జేసీని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా రెవెన్యూ అసోసియేషన్

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా నూతన సంయుక్త కలెక్టర్‌గా శివ నారాయణ శర్మ బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.నరసింహ కుమార్, సెక్రటరీ ఆర్.బాబ్జి, కార్యవర్గ సభ్యులు జాయింట్ కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధి, రెవెన్యూ పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పూర్తి సహకారం అందిస్తామని వారు తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రిపై డిసిహెచ్ఓ ఆకస్మిక తనిఖీ



**కనేకల్- సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డిసిహెచ్ఓ) డేవిడ్ సాల్వన్ రాజ్ కనేకల్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ సందర్భంగా ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. డిసిహెచ్ఓ మాట్లాడుతూ, ఆసుపత్రి సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, రోగులకు సేవలందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం జరగరాదని స్పష్టం చేశారు. అలాగే, చికిత్సా విధానాలు సమర్థవంతంగా అమలవు తున్నాయా లేదా అనే అంశాలను పరిశీలించారు. తనిఖీ సమయంలో ఆసుపత్రిలోని మెడికల్ రికార్డులు, ఎన్టీఆర్ హెల్త్ సేవల అమలు స్థితి, చిన్నపిల్లల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల అమలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ వైద్య సేవలు అందేలా చూడాలని అధికారులు సూచనలు అందించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో డాక్టర్ మొహమ్మద్ షరీఫ్, డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ నిరీషా, డాక్టర్ హనీఫ్ సహా ఆసుపత్రి సిబ్బంది తక్షణంగా ప్రతి చర్యలో పాల్గొని వివరాలు సమర్పించారు.

## ఇన్‌చార్జి కలెక్టర్ విష్ణుకు సమాచార శాఖ అధికారుల స్వాగతం



**అనంతపురం- సూర్య వాస్తవం :** అనంతపురం ఇన్‌చార్జి కలెక్టర్‌గా, జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన విష్ణు చరణ్‌కు డీ.పీ.ఆర్.ఓ బాలకొండయ్య, పీ.ఆర్.ఓ.సూర్యనారాయణ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## నిరాహార దీక్షలకు విరామం

- ప్రజల సంతకాల సేకరణ ఉద్యమం ప్రారంభం
- కాంగ్రెస్, ముస్లిం లీగ్, ప్రజా సంఘాల నేతలు





**రాయచోటి - సూర్య వాస్తవం:** ప్రజల ఆవేదన పేరుతో రాయచోటిని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, ముస్లిం లీగ్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలో ఈనెల 7న ప్రారంభమైన సామూహిక నిరాహార దీక్షలు చేపట్టిన విషయం అందరికీ తెలిసిందే అని కాంగ్రెస్ పార్టీ చీఫ్ సెక్రటరీ అన్నారు. తాము చేపట్టిన నిరాహార దీక్షలు ప్రస్తుతం కొన్ని రోజులు విరామం కల్పిస్తూ, నియోజవర్గం క్షేత్రస్థాయిలో వెళ్లి పదివేల మంది ప్రజల సంతకాల సేకరణ ఉద్యమాన్ని ప్రారంభిస్తామని వారు చెప్పారు.సంతకాల సేకరణ ఉద్యమాన్ని జనవరి 24 నుంచి ఫిబ్రవరి 6 తేదీ వరకు14 మండల కేంద్రాలలో 14 రోజుల పాటు గడపగడపకు తిరిగి సంతకాల సేకరణ ఉద్యమాన్ని రాయ చోటి కాంగ్రెస్ పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 14 మండలాలలో ప్రజల సంతకాల సేకరణ చేపడుతా మన్నారు. సంతకాల సేకరణ అనంతరం మళ్లీ సామూహిక నిరాహార దీక్షలు పునః ప్రారంభిస్తామన్నారు. జిల్లా సాధించేవ రకు మా ఉద్యమం, న్యాయ పోరాటం ఆగదు అన్నారు. ఇంతవరకు మేము చేపట్టిన దీక్షలకు సహకరించిన, ప్రజలకు, ప్రజా సంఘాలకు, విలేకరులకు, పోలీసులు వారికి, రాయచోటి జిల్లా అభిమానులకు మా కృతజ్ఞత అభివందనాలు. మీ ఆధరా భిమానాలు మాపై మా పార్టీ పై ఇలాగే ఉండాలని కోరుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ఐయుఎంఎల్ జిల్లా అధ్యక్షుడు ఎస్ ఎస్ బాషా, ప్రజా సంఘాల నాయకులు అజిజుర్ రహ్మాన్, అస్లాం, జిలన్, ఖాదర్, ఆఫ్టబ్, యాహియా, సురేష్ రెడ్డి, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్‌తోనే సురక్షిత ప్రయాణం

- సీఐ టి.నరసింహులు



**వేంపల్లె - సూర్య వాస్తవం :** వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రోడ్డు ప్రయాణం చేయాలని, అలా చేయడం ద్వారా తమ విలువైన ప్రాణాలను కాపాడు కోవచ్చని వేంపల్లి సీఐ టి.నరసింహులు సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా, ప్రమాదాలు సంభవించిన ప్పుడు తలకు తీవ్ర గాయాలు కాకుండా ప్రాణాలను రక్షించే ప్రధాన సాధనమని సీఐ పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు, ముఖ్యంగా యువత నిర్లక్ష్యంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. చిన్నపాటి ప్రమాదం కూడా ప్రాణాంతకంగా మారే అవకాశముందని, కాబట్టి ముందస్తు జాగ్రత్తగా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాల న్నారు. అలాగే వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనం నడపకూడదని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. రహదారులపై తమతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా మన చేతుల్లోనే ఉంటాయని గుర్తుంచుకుని బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని ఆయన కోరారు. పోలీస్ శాఖ తరపున రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజల సహకారం ఉంటేనే ప్రమాదాలను పూర్తిగా నియంత్రించగలమని వేంపల్లి సీఐ టి. నరసింహులు స్పష్టం చేశారు.

## వినోద్ దుర్గ కుటుంబానికి జనసేన భరోసా

- కూతుళ్ల విద్య బాధ్యత తీసుకున్న పార్టీ
- పవన్ కళ్యాణ్ తరపున తక్షణ ఆర్థిక సాయం

**నాయుడుపేట - సూర్య వాస్తవం :** నాయుడుపేట పట్టణ జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్త వినోద్ దుర్గ అకాల మరణం కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబానికి జనసేన పార్టీ అండగా నిలిచింది. నాయుడుపేట ఏఎంసీ చైర్మన్, జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ బుధవారం పట్టణంలోని బీడీ కాలనీలోని వినోద్ దుర్గ నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తరపున తక్షణ సహాయంగా కొంత నగదు మృతుడి కుటుంబానికి అందజేశారు. అలాగే వినోద్ దుర్గ ఇద్దరు కూతుర్ల విద్యాభ్యాసానికి అవసరమైన సహకారం జనసేన పార్టీ అందిస్తుందని స్పష్టమైన భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఉయ్యాల ప్రవీణ్ మాట్లాడుతూ, పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన ప్రతి కార్యకర్త కుటుంబం తమ కుటుంబమేనని, కష్టసమయంలో వారి వెంట జనసేన పార్టీ ఉంటుందని తెలిపారు. వినోద్ దుర్గ పార్టీకి చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బాలు శెట్టి, రొండ సోమశేఖర్, వీరమహిళ రోహిణి, జనసైనికులు మున్నా, ఇస్మాయిల్, హుస్సేన్, సూరి తదితరులు పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )